Follow: @ANNTELUGU

13-02-2026

# మహా పత్రిక

ANN తెలుగు

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 46 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## లోక్ సభలో రాహుల్ దూకుడు

### సభాహక్కుల తీర్మానానికి కేంద్రం విముఖత


కొన్ని వ్యాఖ్యలు రికార్డుల నుండి తొలగించాలని నిర్ణయం

**ఢిల్లీ,మహా:** ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల తీర్మానానికి కేంద్రం విముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే గురువారం లోక్‌సభలో 'సబ్‌స్టాంటివ్ మోషన్' దాఖలు చేశారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### ఇదే చివరి ఛాన్స్



- విజయ్ మాల్యాకు బాంబే హైకోర్టు వార్నింగ్

02

### బంగ్లాదేశ్ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే..

- భారత్ తో సంబంధాలు మెరుగు
- ప్రతిపక్షపార్టీ బీఎన్పీ ప్రకటన



02

### నో వాట్సప్

- బ్లాక్ చేసి పడేసిన రష్యా
- మెటా తగ్గాల్సిందేనని వార్నింగ్



02

# దూసుకుపో...

## సీఎం రేవంత్‌కు రాహుల్ ప్రశంసలు

### స్థానిక ఫలితాలపై సంతృప్తి

రాహుల్ గాంధీ, ఖర్గే, కేసీలకు రాష్ట్ర పరిస్థితులు వివరించిన ముఖ్యమంత్రి

ఫలితాలపై నివేదికలు అందజేత.. కేంద్రమంత్రులతో సీఎం రేవంత్ వరుస భేటీలు

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తినలో బిజీబిజీగా గడిపారు. ఓ వైపు పార్టీ అగ్రనేతలను, మరోవైపు కేంద్ర మంత్రులను వరుసగ కలుస్తూ పనులను చక్కబెడుతున్నారు. ఓవైపు రాహుల్ గాంధీ, ఖర్గే, కేసీవేణుగోపాల్ లతో భేటీ అయిన సీఎం, మరోవైపు కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, అశ్వినీ శ్రీవైష్ణవ్ లను కలిశారు. శుక్రవారం మరికొందరిని కలవనున్నారు.**



**ఢిల్లీ, మహా :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించామని, మునిసిపల్ ఎన్నిలను విజయవంతంగా పూర్తిచేశామని... ఇందులోనూ మెరుగైన ఫలితాలు సాధించబోతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్ర నేతలకు తెలియజేశారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి .రేవంత్ రెడ్డి బుధ, గురువారాల్లో వేర్వురుగా భేటీ అయ్యారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 70 శాతానికి ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి దక్కాయని, విపక్ష బీఆర్ఎస్, బీజేపీలు పెద్దగా ప్రభావం చూపలేదని సీఎం తెలియజేశారు. అందుకు సంబంధించిన నివేదికలను సీఎం అగ్ర నేతలకు అందజేశారు. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికలు బుధవారం జరిగాయని., శుక్రవారం ఫలితాలు వెలువడనున్నాయని వారికి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ మెరుగైన ఫలితాలు రాబడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సన్నబియ్యం పంపిణీ, ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్ అందజేత వంటి కార్యక్రమాల అమలుతో ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత ఉందని రాహుల్ గాంధీ, ఖర్గే, కేసీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఉద్యోగ నియామకాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు, పార్టీ.. ప్రభుత్వం మధ్య సమన్వయం.. చేసిన పనులను వివరించేందుకు సభల ఏర్పాటుతో క్షేత్ర స్థాయిలో

మిగతా 2లో



## ఎంజీఎంలో కరెంట్ కటకట


- **నిలిచిన సిటీ స్కాన్, ఫిజియోథెరపీ పరీక్షలు**
- **పెద్ద ఆస్పత్రిలో సేవలు అందక నిరాశతో వెనుదిరిగిన రోగులు**

**వరంగల్ మహా;** ఉత్తర తెలంగాణకే పెద్ద ఆస్పత్రి అయిన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇప్పటికే సిబ్బంది కొరత, అర కొర సౌకర్యాలు మందుల కొరతతో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. తాజాగా కరెంట్ అంతరాయం మరో కొత్త సమస్యగా మారింది.

మిగతా 2లో

## హైదరాబాద్‌లో రూ.2200 కోట్ల విలువైన భూమి స్వాధీనం

స్థానికుల సమాచారం.. హైడ్రా ఆపరేషన్



**హైదరాబాద్, మహా :** రాజధాని నగరం హైదరాబాద్‌లోని కీలక ప్రాంతమైన మాదాపూర్‌లో ఆక్రమణదారుల గుండెల్లో హైడ్రా మరోసారి రైళ్లు పరిగెత్తించింది. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ సమీపంలోని మొండికుంట చెరువు, దానిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములపై జరిగిన భారీ ఆక్రమణలను హైడ్రా అధికారులు గురువారం నేలమట్టం చేశారు. ఈ ఆపరేషన్ ద్వారా సుమారు 11 ఎకరాల విలువైన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

మిగతా 2లో

## అధికారంలో వాటా..

- **తమిళనాడులో ఆ సిస్టం లేదు**
- **కాంగ్రెస్ తో కలిసే ఎన్నికలు ఎదుర్కొంటాం**
- **తేల్చేసిన స్టాలిన్**



**మహా:** తమిళనాడు రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వాటా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి, డీఎంకే పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ మొదటిసారి స్పష్టమైన ప్రకటన చేశారు. తమిళనాడులో అధికార భాగస్వామ్యం అనే వాదనకు చోటు లేదని ఆయన తేల్చిచెప్పారు.

మిగతా 3లో

## నేనే రాజు నేనే మంత్రి

### తెలంగాణలో నాకెవరూ పోటీ కారు

పదిన్నరేళ్ళు నేనే సీఎం.. ఎన్టీఆర్ జాతీయ సొత్తు

ఆయనకు భారతరత్న ఇవ్వాలి.. కాళేశ్వరం పై కేంద్రం ఎందుకు విచారించట్లే?

మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి చిట్ చాట్



**ఢిల్లీ, మహా :** తెలంగాణలో నేనే రాజు నేనే మంత్రినని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాను ఎవరితోనూ పోల్చుకోనని.. తనకు ఎవరూ పోటీ కారన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా 2029లో జమిలి ఎన్నికలు రానున్నాయని ఆయన జోస్యం చెప్పారు. పదిన్నరేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని పునరుద్ఘాటించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వడంపై తన మద్దతు ఉంటుందన స్పష్టం చేశారు. త్వరలోనే హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ జరుగుతోందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎంత నష్టం జరిగిందో.. అంచనా కోసం కమిటీకి బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు. కమిటీ నివేదిక అందిన తర్వాతే కాళేశ్వరంపై ఆలోచిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

**కాళేశ్వరం విచారణను కేంద్రం పెండింగ్ లో పెట్టింది**

కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలని కేంద్రాన్ని కోరామని రేవంత్ రెడ్డి తెలిపారు. కానీ ఈ అంశాన్ని కేంద్రం పెండింగ్‌లో పెట్టిందని తెలిపారు. ఈ అంశంలో సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో మూడు పిల్లర్లు

మిగతా 2లో

### తెలంగాణ పేరుతోనే రాజకీయపార్టీ

## ఖచ్చితంగా స్థాపిస్తా...

నా పక్కన పైరవీకారులు లేరు.. ఉద్యమకారులే ఉన్నారు

తెలంగాణ జాగృతి చీఫ్ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, మహా :** రాజకీయ పార్టీని తాను కచ్చితంగా స్థాపిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ పేరుతోనే పార్టీ ఉంటుందని పేర్కొన్నారు.

మిగతా 2లో

## క్యాంప్ పాలిటిక్స్

### రిజల్ట్ రాకముందే అలర్ట్

- **వన్ సైడ్ లేని మునిసిపాలిటీల్లో నేతల జాగ్రత్తలు**
- **క్యాంపులకు తరలించాలని బీజేపీ హైకమాండ్ ఆదేశాలు**
- **మునిసిపాలిటీల్లో పరిస్థితులను బట్టి కాంగ్రెస్ జాగ్రత్తలు**
- **బీఆర్ఎస్ ది కూడా పలుచోట్ల అదే దారి.. నేడే ఫలితాలు**





**హైదరాబాద్, మహా:** మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కోసం పార్టీలు ఎదురుచూస్తుండగా, ట్రెండ్స్ ఆధారంగా రాజకీయపార్టీలు అలర్ట్ అయ్యాయి. శుక్రవారం కౌంటింగ్ జరగనుండగా, ఈనెల 16న చైర్మన్, మేయర్ ల ఎన్నిక జరగనుంది. అప్పటివరకూ కార్పొరేటర్లను, కౌన్సిలర్లను పదిలంగా కాపాడుకోవడం పార్టీల ముందున్న సవాలు. ప్రలోభాలకు గురికాకుండా, అవతలి పార్టీలోకి జంప్ కాకుండా చూసుకునేందుకు

మిగతా 2లో

## కేబుల్ ఛానల్స్ అక్రిడిటేషన్ల సమస్య పరిష్కరిస్తా...

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ



**హైదరాబాద్, మహా:** కేబుల్ ఛానల్స్ అక్రిడిటేషన్ సమస్య పరిష్కరిస్తామని, జీవోను సవరించి పాత పద్ధతిలోనే ఎవరూ ఇబ్బందిపడకుండా న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీనిచ్చారు. గురువారం కేబుల్ ఛానళ్ళ అక్రిడిటేషన్ సమస్య పరిష్కరించాలని, గతంలో ఉన్న పాత జీవో ప్రకారమే అక్రిడిటేషన్లు ఇచ్చి న్యాయం చేయాలని యూనియన్ నేతలు మారుతీసాగర్, రమణ,తో పాటు వివిధ ఛానళ్ళ యాజమాన్యాలు విజ్ఞప్తి చేశారు. గత జీవోలో రాష్ట్ర స్థాయిలో 12, ప్రతీ జిల్లాలో నాలుగు అక్రిడిటేషన్లు

మిగతా 2లో

భారత అమ్ములపొదిలో రఫేల్ 4లో




# దూసుకుపో...

## సీఎం రేవంత్‌కు రాహుల్ ప్రశంసలు





(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీపై పూర్తి సానుకూలత ఉందని అగ్ర నేతలకు సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. క్షేత్ర స్థాయి ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలు సాధించడంపై అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ఖర్గే, కేసీ వేణుగోపాల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు.

**గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి రండి**

మూసీ పునరుజ్జీవం.. రైలు మార్గాల మంజూరు... విమానాశ్రయాల పనులు వేగవంతమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది.. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడులతో గురువారం ముఖ్యమంత్రి వరుసగా భేటీ అయ్యారు. ఆయా ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, భూ బదలాయింపులు.. నిధుల మంజూరును కోరుతూనే రాష్ట్ర ప్రభుత్వపరంగా ఇవ్వనున్నమద్దతు, భూ కేటాయింపులను కేంద్ర మంత్రులకు సీఎం వివరించారు.

**రాజ్ నాథ్ తో..**

ఈసా... మూసీ నదుల సంగమ స్థలిలో ప్రపంచస్థాయి విద్యా సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ కేంద్రంగా నిర్మించనున్నగాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. కేంద్ర మంత్రితో సౌత్ బ్లాక్‌లోని ఆయన కార్యాలయంలో ముఖ్యమంత్రి గురువారం భేటీ అయ్యారు. సుస్థిర పట్టణాభివృద్ధి లక్ష్యాలతో పర్యావరణ హితంగా, స్వచ్ఛమైన నీటితో నది ప్రవహించేలా మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపడుతున్నట్లు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన 100 ఎకరాల రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈసా... మూసీ నదుల సంగమ స్థలిలో 1948లో జాతిపిత మహాత్మా గాంధీ చితభస్మాన్ని నిమజ్జనం చేసిన బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు సీఎం తెలియజేశారు. గాంధీజీ ఆశయాలైన శాంతి, ఐక్యత, సుస్థిరాభివృద్ధి, నిరాడంబర జీవనశైలిని అద్దం పట్టేలా గాంధీ సరోవర్ ప్రాజెక్టును నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టును ప్రపంచస్థాయి విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మక, పర్యావరణ కేంద్రంగా నిలుపుతామని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో శాంతి చిహ్నం, జాతీయ మ్యూజియం, విజ్ఞాన కేంద్రం, చేనేత ప్రోత్సాహక కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కు ఫిబ్రవరి నెలాఖరులో చేసే శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమానికి హాజరుకావాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీ కృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాస రాజు, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

**కేంద్ర నిధులతో కృష్ణా-వికారాబాద్ రైలు మార్గం నిర్మించండి**

కృష్ణావికారాబాద్ రైలు మార్గాన్ని పూర్తిగా కేంద్ర నిధులతో చేపట్టాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ వ్యయాన్ని మొత్తాన్ని తామే భరిస్తామని ఇప్పటికే తెలియజేసిన విషయాన్ని సీఎం కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. ఈ మార్గంలోని టేకల్‌కోడ్ లో లైమ్ స్టోన్ నిక్షేపాలను గుర్తించామని.. సిమెంట్, జౌళి పరిశ్రమల కేంద్రంగా దానిని అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు సీఎం కేంద్ర మంత్రికి తెలియజేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంతో పాటు కర్ణాటకలోని పలు సిమెంట్ పరిశ్రమలకు సమీపంలో కృష్ణా ప్రాంతం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. కొడంగల్, టేకల్‌కోడ్, దౌల్తాబాద్‌లను పారిశ్రామిక జోన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం వివరించారు. హైదరాబాద్‌చెన్నై (778 కి.మీ.), హైదరాబాద్‌బెంగళూర్ (586 కి.మీ.), హైదరాబాద్‌పుణే (556 కి.మీ.) హైస్పీడ్ రైలు కారిడార్లకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలో 500 ఎకరాల స్థలం కేటాయిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తెలియజేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న శంషాబాద్ నుంచే హైస్పీడ్ రైలు మార్గాలని ప్రారంభించాలని సీఎం సూచించారు. హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ కారిడార్ అమరావతి మీదుగా వెళుతుందని, అక్కడి నుంచి బందరు పోర్టుకు రైలు మార్గం మంజూరు చేయాలని కోరారు. దాంతో డ్రైపోర్ట్ నుంచి బందరు పోర్టుకు సరకు రవాణా వేగవంతం అవుతుందని వివరించారు. హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌పుణే హైస్పీడ్ కారిడార్లు శంషాబాద్ నుంచే మొదలు పెడితే అది ట్రై జంక్షన్ అవుతుందని సీఎం రైల్వే మంత్రికి వివరించారు. ఈ మూడు కారిడార్లకు భూ సేకరణ వెంటనే చేపట్టి పనులు ప్రారంభించాలని రైల్వే శాఖ మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలత వ్యక్తం చేశారు. పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, కేంద్ర పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో మమూనూరు ఎయిర్‌పోర్ట్ ను నిర్మించాలి

### పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ కు సమీపంలో నిర్మించనున్న మామూనూరు ఎయిర్‌పోర్ట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణ పూర్తయినందున వెంటనే పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్‌లో కార్గో సేవలతో పాటు మెయింటెనెన్స్.. ఓవర్ హాల్ రిపేర్ (ఎంఓఆర్) సదుపాయాలు ఉండేలా చూడాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. జౌళి, ఇతర పరిశ్రమలతో వరంగల్ నగరం పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని, వరంగల్‌కు దగ్గరలో రెండేళ్లకోకసారి ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్కసారలమ్మ జాతర మేడారంలో జరుగుతుందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ ఉమ్మడి వరంగల్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు కేంద్రంగా ఉంటుందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. మామూనూరు నుంచి సాధ్యమైనంత త్వరగా విమాన రాకపోకలు సాగేలా పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆ విమానాశ్రయ ఏర్పాటుకు అదనంగా అవసరమైన 249.82 ఎకరాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. వెంటనే అనుమతుల మంజూరు చేయాలని కోరారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్ పనుల ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను అక్కడకు పంపిస్తానని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, కేంద్ర పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

# నేనే రాజు నేనే మంత్రి

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే కూలాయని చెప్పడం పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు. ప్రాజెక్ట్ లోపల బాంబు పెడితే పైన పేలుతుంది.. కింద కూలదని స్పష్టం చేశారు. మూడు పిల్లర్లా?.. ముప్పయ్ పిల్లర్లా? అనేది కమిటీ నిర్ధారించిన తర్వాత చెబుతామని చెప్పారు. కృష్ణా జలాలపై తాము అడిగినవన్నీ ఇస్తే ఆంధ్రప్రదేశ్‌కి సైతం సహకరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. కవిత పార్టీ గురించి తమకు తెలియదన్నారు.

**హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహం**

ఎన్టీఆర్ జాతీయ నాయకుడని.. ఆయన ఏ ఒక్కరి సొత్తు కాదు.. జాతీయ సొత్తు అని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని తాను వ్యక్తిగతంగా డిమాండ్ చేస్తున్నానన్నారు. ఎన్టీఆర్ గురించి ఎవరైనా తక్కువగా మాట్లాడితే వారంతా మూర్ఖులు ఎవరు ఉండరన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహం పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దత్తపుత్రుడని పునరుద్ఘాటించారు. కాళేశ్వరంపై 48 గంటల్లో విచారణ చేయిస్తామని కిషన్ రెడ్డి గతంలో ప్రకటించారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. కానీ ఇప్పటివరకూ సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించలేదంటూ కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరంపై



తాము నేరుగా సీబీఐ డైరెక్టర్‌కు లేఖ రాశామని వివరించారు.

**ఆయన విచారణ తర్వాతే.. ఒక్కొక్కరికీ నోటీసులు**

జడ్జీలు, జర్నలిస్టులు, రాజకీయ నేతల ఫోన్లు సైతం ట్యాప్ చేశారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కారకుడు ప్రభాకర్‌రావు 20 నెలలపాటు విదేశాలకు పారిపోయారని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలతోనే ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును స్వదేశానికి తీసుకొచ్చామని వివరించారు. ప్రభాకర్‌రావు విచారణ తర్వాతే ఒక్కొక్కరికీ సిట్ నోటీసులు జారీ చేస్తోందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఎస్ఐబీలో కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును తెలంగాణ హైకోర్టు.. సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# హైదరాబాద్‌లో రూ.2200 కోట్ల విలువైన భూమి స్వాధీనం

### స్థానికుల సమాచారం.. హైడ్రా ఆపరేషన్

(మొదటిపేజీ తరువాయి)

స్వాధీనం చేసుకున్న 11 ఎకరాల భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.2,200 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సర్వే నంబర్ 53లోని మొండికుంట చెరువు భూమి, సర్వే నంబర్ 55లోని ప్రభుత్వ స్థలాల్లో ఈ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఆక్రమించిన ప్రభుత్వ స్థలంలో ఉన్న వందలాది తాత్కాలిక షెడ్లు, 30కి పైగా పక్కా షాపులను బుల్డోజర్లతో కూల్చివేశారు. ఇందులో మెకానిక్ షెడ్లు, ఐరన్, స్టీల్ దుకాణాలు ఉన్నాయి. ఈ షాపుల ద్వారా కబ్జాదారులు నెలకు లక్షలాది రూపాయల అద్దెలు వసూలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఒక ఆలయాన్ని హద్దుగా చూపించి, దాని చుట్టూ ఉన్న స్థలాలను కబ్జా చేసినట్లు అధికారులు నిర్ధారించారు. జనవరి 31న రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా ప్రాథమిక విచారణ చేపట్టింది. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ నుంచి సేకరించిన శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఆక్రమణలు జరిగినట్లు శాస్త్రీయంగా ధృవీకరించుకున్నారు.

**ముందస్తు నోటీసుల తర్వాతే చర్యలు**

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ నిర్వహించారు. కబ్జాదారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి, గడువు ముగిసిన తర్వాతే భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మాదాపూర్ పోలీసులు గట్టి భద్రత కల్పించారు.

# లోక్ సభలో రాహుల్ దూకుడు

(మొదటిపేజీ తరువాయి)

రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడమే కాకుండా, జీవితాంతం ఆయన ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ ప్రవేశపెట్టిన ఆ తీర్మానంపై కేంద్రం విముఖంగా ఉన్నట్టు సమాచారం. రాహుల్‌గాంధీ బుధవారం చేసిన ప్రసంగం నుంచి కొన్ని వ్యాఖ్యలు తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. 'జార్జ్ సోరోస్ వంటి శక్తుల సహాయంతో రాహుల్ గాంధీ దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ నేను ఈరోజు లోక్‌సభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. ఈ విషయాన్ని చర్చించాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయన జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని డిమాండ్ చేస్తున్నా' అంటూ దూబే అన్నారు. అమెరికాభారత్ ట్రేడ్ డీల్ గురించి రాహుల్ గాంధీ బుధవారం లోక్‌సభలో తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా భారత ప్రయోజనాలను పూర్తిగా అమెరికాకు తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ ట్రేడ్ డీల్‌ను రాహుల్ గాంధీ 'పూర్తి లొంగుబాటు'గా అభివర్ణించారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికాకు అప్పగించారని, రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ పడ్డారని ఆరోపించారు. రాహుల్ గాంధీ ప్రసంగంపై బీజేపీ ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ రాహుల్ మునుపటికన్నా దూకుడు ప్రదర్శిస్తూ అధికారపక్షానికి సవాల్ విసురుతున్నారు.

# ఎంజీఎంలో కరెంట్ కటకట

### నిలిచిన సిటీ స్కాన్, ఫిజియోథెరపీ పరీక్షలు

### పెద్ద ఆస్పత్రిలో సేవలు అందక నిరాశతో వెనుదిరిగిన రోగులు

(మొదటిపేజీ తరువాయి)

గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో పలు వైద్య సేవలు పూర్తిగా స్తంభించాయి. కరెంట్ లేకపోవడంతో సిటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, ఫిజియోథెరపీ వంటి కీలక నిర్ధారణ సేవలు పూర్తిగా నిలిచి పోయాయి. ఈ సేవల కోసం ఆస్పత్రికి వచ్చిన పలువురు రోగులు కరెంట్ లేదని సిబ్బందికి తెలియజేస్తూ వెనుదిరగమని సూచించారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ముఖ్యంగా అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగులు ఇబ్బందులు పడినట్లు సమాచారం. ఇప్పటికే ఎంజీఎం ఆస్పత్రి నిర్వహణ లోపాల పై పలు విమర్శలు వినిపిస్తుండగా, తాజా కరెంట్ సమస్యతో పరిస్థితి మరింత దిగజారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు, అధికారులు మారుతున్నా ఆస్పత్రి పరిస్థితిలో ఏ మాత్రం ఆశించినంత మార్పు కనిపించడం లేదని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఇదే చివరి ఛాన్స్

### విజయ్ మాల్యాకు బాంబే హైకోర్టు వార్నింగ్

**హైదరాబాద్, మహా :** పరారీలో ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యాకేసు విషయంలో బాంబే హైకోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. మాల్యా భారత్‌కు తిరిగి వచ్చే వరకూ ఆయన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేది లేదని పేర్కొంది. మాల్యాను పరారీలో ఉన్న ఆర్థికనేరస్థుడిగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ ఆయన తరపు న్యాయవాదులు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ శ్రీచంద్ర శేఖర్, జస్టిస్ గౌతమ్ అఖండ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌కు తిరిగి రావడంపై స్పష్టతనిచ్చేందుకు మాల్యాకు ఇదే చివరి అవకాశమని ధర్మాసనం పేర్కొంది. మాల్యా భారత్‌కు రానంటే ఈ పిటిషన్‌ను స్వీకరించలేమని తేల్చి చెప్పింది. నగదు అక్రమ రవాణా, లోన్‌లు చెల్లించకపోవడం తదితర ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయ్ మాల్యా 2016 నుంచి బ్రిటన్‌లో ఉంటున్న విషయం తెలిసిందే. ఆయనపై ఇప్పటికే పీఎంఎల్ఏ చట్టం కింద కేసు నమోదైంది. ఈ విషయమై విచారణ చేపట్టిన ప్రత్యేక న్యాయస్థానం 2019లో మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించింది. ఇక మాల్యాను భారత్‌కు రప్పించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేపట్టిన చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. మరోవైపు, విజయ్ మాల్యా కూడా కోర్టును ఆశ్రయించారు. తనను పరారీలో ఉన్న నేరస్థుడిగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల చట్టం2018 రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ మరో పిటిషన్‌ను దాఖలు చేశారు.

# క్యాంప్ పాలిటిక్స్

## రిజల్ట్ రాకముందే అలర్ట్

(మొదటిపేజీ తరువాయి)

క్యాంపులు, రిసార్టులు, ట్రిప్‌ల పేరుతో గురువారం ఉదయం నుండే తరలిస్తున్నారు. ముందుగా బీజేపీనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం గమనార్హం. కార్పోరేషన్లతో పాటు పలు మునిసిపాలిటీలలో హంగ్ ఏర్పడుతుందన్న అంచనాల నేపథ్యంలో.. తమ వారు జారిపోకుండా చూసుకోవడం పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది. బీజేపీ నిర్మల్, ఖానాపూర్, ఆదిలాబాద్‌తో పాటు కరీంనగర్, నిజామాబాద్ తదితర ప్రాంతాల కౌన్సిలర్, కార్పోరేటర్ అభ్యర్థులను వివిధ ప్రాంతాలకు తరలించింది. ఆదిలాబాద్ పై ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ సొంతపార్టీ కౌన్సిలర్ ను క్యాంప్ కు తరలించినట్లు తెలుస్తోంది. మెజారిటీ వస్తుందనుకున్న మునిసిపాలిటీల్లో కూడా జాగ్రత్తగా ఉండే నష్టం లేదన్న అంచనాతో అభ్యర్థులను క్యాంపులకు తరలించింది.

**మూడు రోజులు కీలకం**

కౌంటింగ్ ప్రక్రియ శుక్రవారం పూర్తికానున్నది. ఏ పార్టీ బలమెంతో తేలిపోతుంది. మున్సిపాలిటీల చైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్, కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ఈ నెల 16న జరగనున్నది. హంగ్ వచ్చినచోట్ల మ్యాజిక్ ఫిగర్‌కు అవసరమైన స్థాయిలో కౌన్సిలర్లు, కార్పొరేటర్లను కూడగట్టుకోవడం పార్టీలకు సవాలులాంటిది. ఇందుకోసం ప్రలోభాల పర్వం తప్పకపోవచ్చు. దీని బారిన పడకుండా ఉండేందుకు క్యాంప్ పాలిటిక్స్ కూడా అనివార్యం కావచ్చు. మూడు రోజుల పాటు కౌన్సిలర్లు, కార్పొరేటర్లను చేజారకుండా చూసుకోవడం పార్టీలకు కత్తిమీద సాము లాంటిది. ఎన్నికల్లో గెలవడానికి అభ్యర్థులు ఖర్చు చేస్తే ఇప్పుడు వారిని కాపాడుకోడానికి పార్టీలు ఖర్చు చేయాల్సి రావచ్చు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రలోభాలకు పాల్పడితే అప్పటి ప్రతిపక్ష పార్టీలు గోవా లాంటి చోట్లకు తరలించాల్సి వచ్చింది. ఇప్పుడు దానికి భిన్నంగా బీఆర్ఎస్ క్యాంప్ పాలిటిక్స్ చేపట్టక తప్పని పరిస్థితులు ఏర్పడనున్నాయి.

**మెజారిటీ రాకుంటే అధికారపార్టీకే మొగ్గు**

గత ఎన్నికల్లో నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక అనేక మలుపులు తీసుకున్నది. అన్ని పార్టీల కంటే ఎక్కువ మంది కార్పొరేటర్లను 28మందిని గెలిపించుకున్న బీజేపీ మేయర్ పీఠాన్ని చేజార్చుకున్నది. కేవలం 13 మంది కార్పొరేటర్లే ఉన్న బీఆర్ఎస్ ఆ పోస్టును చేజిక్కించుకున్నది. ఇందుకు మజ్లిస్ తరఫున గెలిచిన 16 మంది మద్దతు తీసుకున్నది. దీనికి తోడు ఒక స్వతంత్ర అభ్యర్థి, ఇద్దరు కాంగ్రెస్ కార్పొరేటర్లను లాక్కున్నది. ఎలాగూ ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల ఓట్లతో మొత్తం బలం 38కు చేరుకుంది. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థి మేయర్ అయ్యారు. ఎక్కువ స్థానాలు గెలుచుకున్నా బీజేపీ అధికారానికి దూరంగా ఉండిపోయింది. ఈసారి ఇలాంటి సీన్ ఎక్కడ రిపీట్ అవుతుందన్నది కౌంటింగ్ రోజున తెలుస్తుంది. ఈసారి ముందుగానే క్యాంపు రాజకీయాలు మొదలు కాగా. ఈ మూడు రోజుల్లో రాజకీయం గమ్మత్తు మలుపులు తీసుకునే అవకాశాలున్నాయి.


## తెలంగాణ పేరుతోనే రాజకీయపార్టీ

# ఖచ్చితంగా స్థాపిస్తా...

### నా పక్కన పైరవీకారులు లేరు.. ఉద్యమకారులే ఉన్నారు... తెలంగాణ జాగృతి చీఫ్ కల్వకుంట్ల కవిత

(మొదటిపేజీ తరువాయి)

జాగృతి రాజకీయ శక్తిగా మారుతుందని తెలిపారు. స్వీయ అస్తిత్వం, ఉద్యమ ఆకాంక్షలు, తెలంగాణ వాదాన్ని నిలబెట్టుకోవడం కోసమే రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ పార్టీ ఫక్తు రాజకీయ పార్టీగా ఉండదని కుండబద్దలు కొట్టారు. రాజకీయ పార్టీ స్థాపిస్తానంటే.. తనపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు తన పక్కన పైరవీకారులు లేరని.. ఎప్పుడూ ఉద్యమకారులే ఉన్నారని ఈ సందర్భంగా కవిత చెప్పుకొచ్చారు . గురువారం నాడు బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సభలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. ఉద్యమకారులను పట్టించుకోలేదు కాబట్టే ఆ పెద్ద మనిషి అధికారం కోల్పోయారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని పరోక్షంగా విమర్శించారు. గత పాలకులు అహంకారం ఎక్కువై ఓడిపోయారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై విమర్శలు సంధించారు. కేసీఆర్ హయాంలో అసెంబ్లీ



ముందు ఉద్యమకారుడు ఆత్మాహుతి చేసుకుని చనిపోయాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని సైతం ఉద్యమకారులు బంగ్లా నుంచి బయటకు గుంజుతారని జోస్యం చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత 63 సీట్లతో అధికారం ఇస్తే.. అన్ని పార్టీలను విలీనం చేసుకున్నారంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె నిప్పులు చెరిగారు. ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో ప్రజాస్వామ్య విలువలు కాల రాయబడ్డాయన్నారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ ఎత్తేశారని.. సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే అరెస్టులు చేశారంటూ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో ఎవర్ని గెలిపించినా.. బీఆర్ఎస్ పార్టీలోకే వెళ్తారన్న పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత.. చిన్న వారికి లాభం జరగలేదని తెలిపారు. కానీ మెగా కృష్ణారెడ్డి మాత్రమే కుబేరుడు అయ్యాడంటూ వ్యంగ్యంగా అన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేసే బాధ్యత తీసుకోవాలంటూ ప్రొఫెసర్ కోదండరాంకు ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత సూచించారు. ప్రో.కోదండరాం, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరుల లాంటి వారి వల్లే సీఎం రేవంత్ రెడ్డిని ఉద్యమకారులు నమ్మారన్నారు. అయితే రెండేళ్లుగా ఎందుకు మాట్లాడటం లేదంటూ ప్రో.కోదండరాంను ఈ సందర్భంగా కవిత సూటిగా ప్రశ్నించారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ సంక్షేమ బోర్డు ప్రకటన చేయాలంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో 25 శాతం కోటాను ఉద్యమకారుల పిల్లలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

## బంగ్లాదేశ్ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే..

**మహా:** బంగ్లాదేశ్ ఎన్నికలు గురువారం జరిగాయి. భారత్‌తో సహా అన్ని దేశాలతో సాధ్యమైనంత మంచి సంబంధాలు కొనసాగించడం బంగ్లాదేశ్‌కు చాలా ముఖ్యం. ప్రజల మధ్య సంబంధాలు, వాణిజ్యం, వ్యాపారం, విద్య, వైద్యం వంటి రంగాల్లో బంధాలను బలోపేతం చేయాలనుకుంటున్నాం. అయితే, ఈ సంబంధాలు న్యాయం, సమానత్వం అనే సూత్రాలపై ఆధారపడి ఉండాలి" అని బీఎన్‌పీ అధికార ప్రతినిధి మహదీ అమీన్ ఉద్ఘాటించారు.

## కేబుల్ ఛానల్స్ అక్రిడిటేషన్ల సమస్య పరిష్కరిస్తా...

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారని ఇపుడు కూడా ఛానల్ ప్రసారమయ్యే జిల్లాల్లో అదే పద్ధతిన ఇవ్వాలని, ఎంతో వ్యయంతో ఉపాధి కల్పిస్తూ నడుపుతున్న ఛానళ్ళకు సహకరించాలని కోరారు. ఎవరినీ ఇబ్బంది పెట్టే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదని, కేబుల్ ఛానళ్ళకు పాతపద్ధతిలోనే అక్రిడిటేషన్లు మంజూరుచేస్తామని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా హామీనిచ్చారు. దీనిపై తాను అధికారులకు ఆదేశాలిస్తానని, ఎవరూ అధైర్యపడవద్దన్నారు. తమది ప్రజాప్రభుత్వమని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఎవిఎన్ ఛానల్ నుండి మందడి అరవింద్ రెడ్డి, వీ5 ఛానల్ వెంకట్, కోవా టీవీ దేవేందర్, ఎబి న్యూస్ బ్రహ్మం, న్యూస్ 9 చలపతి తో పాటు వివిధ ఛానళ్ళ ప్రతినిధులు ఉన్నారు.

## అధికారంలో వాటా..

(మొదటిపేజీ తరువాయి)

ఇది కూటమిని బలహీనపరచే ప్రయత్నమని పేర్కొన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ డీఎంకే- కాంగ్రెస్ కూటమిలో సీట్ల పంపకం, అధికార భాగస్వామ్యం అంశాలపై చర్చలు ఊపందుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఈసారి ఎక్కువ సీట్లు ఇవ్వాలని కోరడంతో పాటు, ఎన్నికల తర్వాత ప్రభుత్వంలో కూడా తమకు వాటా ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. అయితే ఇప్పటివరకు డీఎంకే నుంచి అధికారిక స్పందన లేకపోవడంతో కూటమి భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం స్టాలిన్ ఈ అంశంపై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ షేర్ ఇన్ పవర్ నినాదంపై మోడరేటర్ అడిగిన ప్రశ్నకు ఆయన స్పష్టంగా స్పందించారు. "అధికారంలో వాటా అనే వాదన తమిళనాడుకు సరిపోదు. ఇది డీఎంకేకి కూడా తెలుసు, కాంగ్రెస్‌కూ తెలుసు. మధ్యలో ఉన్న కొందరు కూటమిని చీల్చేందుకు చేస్తున్న కుట్రే ఈ ప్రచారం" అని స్టాలిన్ పేర్కొన్నారు.

**కాంగ్రెస్ తో కలిసి ఎదుర్కొంటాం**

తమిళనాడు రాజకీయాల స్వభావాన్ని గుర్తుచేస్తూ, "మా రాష్ట్రం ఎప్పటినుంచో స్వయంప్రతిపత్తి, కేంద్రంలో సమాఖ్య వ్యవస్థ అనే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఇక్కడ అధికార భాగస్వామ్యం అనే భావనకు స్థానం లేదు. కూటమిలోని మిత్రపక్షాలన్నీ దీన్ని అంగీకరించాయి" అని ఆయన స్పష్టం చేశారు. కూటమిలో అంతర్గత విభేదాలు ఉన్నాయనే ప్రచారాన్ని ఖండిస్తూ, "డీఎంకే కూటమిలో ఎలాంటి సమస్యలు లేవు. అవగాహనతోనే ముందుకు సాగుతున్నాం. కాంగ్రెస్‌తో కలిసి కూటమిగా ఎన్నికలను ఎదుర్కొంటాం" అని సీఎం చెప్పారు..



## ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లించాలని లబ్ధిదారుల విజ్ఞప్తి

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మండలం పోలేపల్లి గ్రామంలో పెండింగ్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను విడుదల చేయాలని కోరుతూ లబ్ధిదారులు గురువారం ఎంపీడీవో కుసుమ మాధురిని కలిశారు. సకాలంలో బిల్లులు అందకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.స్పందించిన ఎంపీడీవో.. బిల్లులు త్వరగా అందేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆమెకు వినతిపత్రం అందజేశారు.



## మున్సిపల్ ఓట్లు లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

**ఆమనగల్లు,మహా:** ఈనెల 13న ఆమనగల్లు మున్సిపల్ ఓట్లు లెక్కింపునకు బ్రిలియంట్ పాఠశాలలో ఏర్పాట్లు చేశారు.. 15 వార్డులు ఉండగా, రెండు గదుల్లో 5 టేబుళ్లు ఏర్పాటు చేశారు.. రిసెప్షన్ కౌంటర్, స్క్రీన్, ప్రజాప్రతినిధులు కూర్చోవటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల సహాయ అధికారిఅధికారి శంకర్నాయక్ తెలిపారు. ఆరుగురు సూపర్ వైజర్లు, 12 మంది సహాయక సూపర్వైజర్లు,ఆర్వోలు ఆరుగురితో పాటు ఏఆర్వోలు విధులను నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ గదిలో ఉన్న బ్యాలెట్ పెట్టెలను ఓట్ల లెక్కింపు 8.00 గంటలకు ఎక్కింపు ప్రక్రియ ప్రారంభించి మూడు రౌండ్లలో లెక్కింపు పూర్తవగానే అభ్యర్థులను ప్రకటించి ధ్రువపత్రాలు అందజేస్తామని అన్నారు.



## శాంతి భద్రతల కోసం సెక్షన్ 163 ఆదేశాలు

**ఫ్యూచర్ సిటీ కమిషనర్ జి సుధీర్ బాబు**

**ప్రజలు పోలీసులకు సహకరించాలి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతి భద్రతలు కాపాడుటకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ భారతీయ నాగరిక సురక్షా సంహిత (BNSS) సెక్షన్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు జారీ చేశారు. నేటి ఉదయం 6:00 గంటల నుండి రాత్రి 11:00 గంటల వరకు సంబంధిత కౌంటింగ్ కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో 5 మందికి మించిన గుంపులు కూడకుండా నిషేధం అమల్లో ఉంటుందన్నారు. ఈ ఆదేశాలు ఆమనగల్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మరియు చేవెళ్ల ప్రాంతాల్లో అమలులో ఉంటాయని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి శాంతి భద్రతలు కాపాడాలని విజ్ఞప్తి చేయబడింది. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

# 108 వాహనాల ఆకస్మిక తనిఖీలు

### ఇబ్రహీంపట్నం సిహెచ్సిని సందర్శించిన జిల్లా అధికారి

### 108 వాహనాల ప్రాముఖ్యత ఎంతో ఉంది .. అంబులెన్స్ సిబ్బందికి తగు సూచనలు సలహాలు




**రంగారెడ్డి జిల్లా మహా :** జీవీకే ఈఎమ్ఆర్ఐ 108 102 అమ్మఒడి, 1962 పశు సంచార వాహనాలను, జిల్లా అధికారిగా షేక్ జాన్ షాహిద్ ఆకస్మిక తనిఖీలు చేశారు. గురువారం ఇబ్రహీంపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అయిన ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా అధికారిగా షేక్ జాన్ షాహిద్, రాజబాబు, జిల్లా మేనేజర్ ప్రదీప్ కుమార్ తో కలిసి 108 వాహనాలను ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందికి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ప్రమాదం ఎక్కడ జరిగిన అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వచ్చిన వెంటనే అప్రమత్తంగా ఉండాలని, వెంటనే స్పందించాలని, నిర్లక్ష్యం వహించరాదని 108, 102, 1962 సిబ్బందికి తెలుపుతూ వాళ్ళ యొక్క పనితీరును కొనియాడారు.

**108 వాహనాల ప్రాముఖ్యత ఎంతో....**

ప్రాణాపాయ పరిస్థితిలో అత్యవసర సమయంలో సేవలందించే 108,102 అమ్మఒడి, 1962 పశు సంచార వాహనాల సేవలను పరిశీలించిన, జిల్లా అధికారిగా షేక్ జాన్ షాహిద్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చెప్పట్టిన ఈ పథకాలను ప్రజలకు మరింత చేరువగా తీసుకెళందుకు కృషిచేస్తానని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందించటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో అత్యవసర పరిస్థితుల్లో మనుషుల ప్రాణాపాయ పరిస్థితి నుంచి కాపాడే 108 అంబులెన్సు 32, బాలింతలను గర్భిణీ మహిళలను ఆసుపత్రికి నుంచి వాళ్ల ఇంటి వద్దకు చేర్చే అమ్మఒడి 102 వాహనాలు 10, పశు సంచార వాహన 1962 వాహనాలు 4 నిరంతరం ప్రజలకు సేవలు అందజేస్తున్నాయని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆశ వర్కర్లు ఈ సేవలను ప్రజలకు చేరువలో తీసుకెళ్లడంలో ప్రధాన పాత్ర పోషించి, మాత శిశు మరణాలను తగ్గించేందుకు కృషి చేయాలనీ కోరారు. ఈ సందర్భంగా 108 పైలెట్ జోగు శ్రీరామ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం..!

- **జిల్లాలో నేడే కౌంటింగ్.. గెలుపు ఎవరిదో..**
- **స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరచిన బ్యాలెట్ బాక్స్ లు**
- **కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసుల పహారా**
- **ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించరాదు...**
- **ఎన్నికల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నేడు శుక్రవారం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు, ఓట్ల లెక్కింపు కోసం పూర్తి ఏర్పాట్లు చేయడం జరిగిందని, రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణరెడ్డి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపాలిటీ ఎన్నికలలో పోటీల్లో పాల్గొన్న అభ్యర్థుల భవితవ్యం, స్ట్రాంగ్ రూములలో భద్రపరచిన బ్యాలెట్ బాక్స్ లలో నిక్షిప్తమై ఉన్నది. ఈనెల 11న జరిగిన పోలింగ్లో ఓటర్లు తమ వార్డులలో అభివృద్ధి చేయగలిగే నాయకునికి ఓటు వేయడం జరిగింది. మున్సిపాలిటీ ఎన్నికల పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేసి, ప్రజల మన్ననలు ఎవరు పొందారు అనే నాయకుల భవితవ్యం నేడు తేలనుంది. ఎవరు గెలుస్తారు ఎవరు ఓడుతారు, ఎవరు గెలిచినా ఎవరు ఓడినా గెలుపోవటములను సహజంగా తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో పాల్గొన్న అభ్యర్థులు తమ యొక్క గెలుపు ఓటములను తెలుసుకునే రోజు నేడు.

**జిల్లాలోని ఓట్ల లెక్కింపు కేంద్రాలు....**

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఆర్వోలది తుది తీర్పుగా ఉంటుందని అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను అనుసరించి ఓట్ల లెక్కింపులో పాల్గొనాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటుచేసిన కోట్ల లెక్కింపు కేంద్రాలు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి సంబంధించిన కౌంటింగ్, శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆమనగల్ మున్సిపాలిటీకి సంబంధించి ఓట్ల లెక్కింపు, బ్రిలియంట్ గ్రామర్ స్కూల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. మొయినాబాద్ మున్సిపాలిటీకి సంబంధించి మ్యాక్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ చిలుకూరులో నిర్వహించనున్నారు. చేవెళ్ల మున్సిపాలిటీకి సంబంధించి పరాహ్ ఇంజనీరింగ్ కాలేజ్ లో ఓట్ల లెక్కింపు జరగనుంది. షాద్నగర్ మున్సిపాలిటీకి సంబంధించి మినీ స్టేడియం ఓల్డ్ ఎన్హెచ్ 47 హైదరాబాద్ రోడ్డులో కౌంటింగ్ నిర్వహించనున్నారు. శంకర్ పల్లి మున్సిపాలిటీకి సంబంధించి మున్సిపల్ ఆడిటోరియం భవనంలో ఓట్ల లెక్కింపు జరగనుంది. పై తెలిపిన ఓటింగ్ కేంద్రాలలోని స్ట్రాంగ్ రూములలో పోలీస్ పహార మధ్య బ్యాలెట్ బాక్స్ లు భద్రపరచడం జరిగింది. అధికారులు, అభ్యర్థులు ఎవరైనా ఎన్నికల నిబంధనలను ఉల్లగించరాదని ఉల్లంఘించిన ఎడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎన్నికల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా ఎన్నికల అధికారి తెలియడం జరిగింది.

## కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో వివిధ కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తులు నిర్వహించినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి,చెన్నూర్, లక్షెట్టిపేట మున్సిపాలిటీలలో జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు భారీ బందోబస్తు నిర్వహించినట్లు వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలోని రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈ ప్రాంతాలలో 144 సెక్షన్ అమలులో ఉన్న దృశ్య ప్రజలు గుంపులుగా చేరకుండా ఉండాలని పోలీసులకు సూచించారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డును భద్రతా సిబ్బందికి చూపించిన వారికే కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశం ఇవ్వాలని వివరించారు. మొబైల్ ఫోన్లు,ఎలక్ట్రానిక్ పరికరాలు, లైటర్లు వంటి నిషేధిత వస్తువులను కౌంటింగ్ హాల్లోకి తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు బాణాసంచా, డీజేలను పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. అధికారులు, పోలీసులు, ఏజెంట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## నేటి కౌంటింగ్ ప్రక్రియ కొరకు అన్ని ఏర్పాట్లు సిద్ధం

**మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** నాడు జరుగుతున్న కౌంటింగ్ ప్రక్రియ కొరకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాల, బెల్లంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నూర్ పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్ లో, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ కొరకు అదనపు సిబ్బందితో కలిపి 66 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 132 మంది కౌంటింగ్ సహాయకులు, బెల్లంపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 19 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 37 మంది కౌంటింగ్ సహాయకులు, చెన్నూరు మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 10 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 20 మంది కౌంటింగ్ సహాయకులు,, క్యాతనపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 24 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 48 మంది కౌంటింగ్ సహాయకులు, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 9 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 18 మంది కౌంటింగ్ సహాయకులను రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ బెల్లంపల్లి మున్సిపాలిటీకి సంబంధించి 34 వార్డులకు గాను 17 టేబుల్స్ ఏర్పాటు చేసి 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, చెన్నూరు మున్సిపాలిటీకి సంబంధించి 18 వార్డులకు గాను 9 టేబుల్స్ ఏర్పాటు చేసి, 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి సంబంధించి 15 వార్డులకు గాను 8 టేబుల్స్ ఏర్పాటు చేసి 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, క్యాతనపల్లి మున్సిపాలిటీకి సంబంధించి 22 వార్డులకు గాను 22 టేబుల్స్ ఏర్పాటు చేసి రౌండ్ కి 1 వేయి ఓట్ల చొప్పున 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, మంచిర్యాల నగరపాలక సంస్థకు సంబంధించి 60 వార్డులకు గాను 60 టేబుల్స్ ఏర్పాటు చేసి రౌండ్ కి 1 వేయి ఓట్ల చొప్పున లెక్కించడం జరుగుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## రాజేంద్రనగర్ ప్రత్యేక కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలి

- **రాజేంద్రనగర్‌ను ముక్కలు చేయొద్దు**
- **పలుమార్లు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్న ఫలితం శూన్యం**
- **బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్**



**రాజేంద్రనగర్, మహా ;** ప్రజల మనోభావాలను కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవిస్తూ రాజేంద్రనగర్ ను ప్రత్యేక కార్పొరేషన్ గా ఏర్పాటు చేయాలిని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శంషాబాద్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావుకు బిఆర్ఎస్ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు.రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని హైదరాబాదు కార్పొరేషన్‌లో విలీనం చేయాలనే తాజా జీవోపై నియోజకవర్గ ప్రజలతోపాటు బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుందన్నారు. శంషాబాద్ జోన్ పరిధిలోని పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రనాయకులు మంచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సైబరాబాద్‌ను ఒక కార్పొరేషన్‌గా, హైదరాబాదును మరో కార్పొరేషన్‌గా విభజించే ప్రక్రియలో సింహభాగం ఉన్న రాజేంద్రనగర్ నియోజకవర్గని చేర్చడం పూర్తిగా అన్యాయమైందిగా భావిస్తున్నామన్నారు.ఇప్పటికే ఈ అంశంపై నియోజకవర్గ ప్రజలతో పాటు బిఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున నిరసనలను చేపట్టామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కి కూడా లేఖలు ఇచ్చి, జీహెచ్ఎంసీలో విలీనాన్ని నిలిపి వేయాలని మొరపెట్టుకున్నాము. రాజేంద్రనగర్ ప్రత్యేకతను కాపాడాలని విజ్ఞప్తి చేశామన్నారు. అయినప్పటికీ నియోజకవర్గ ప్రజల అభిప్రాయాలను ఎమ్మెల్యే రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకుండా ముందుకు సాగుతోందని మండిపడ్డారు. రాజేంద్రనగర్‌ను ముక్కలు చేయడం వల్ల మా ప్రాంత విశిష్టత, అస్తిత్వం దెబ్బతింటుంది. మూడు కార్పొరేషన్లు చేయాల్సి వస్తే, రాజేంద్రనగర్‌ను ప్రత్యేక కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని నియోజకవర్గ ప్రజలతో పాటు బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.హైదరాబాదును మూడు కార్పొరేషన్లుగా చేస్తే, జనాభా లెక్కలు, పరిపాలనా సౌలభ్యం, డివిజన్ల సంఖ్య వంటి అంశాల్లో స్పష్టమైన గుణాంకాలు ఉండాలన్నారు. మేడ్చల్ -మల్కాజ్గిరి 75, సైబరాబాద్ 75 డివిజన్లు ఉంటే, హైదరాబాదుకు 150 డివిజన్లు ఎందుకు? జనాభా సుమారు సమానంగా ఉంటే ఈ అసమానతకు కారణం ఏమిటి? ఈ నిర్ణయంలో సాంకేతికత ఎక్కడ? పారదర్శకత ఎక్కడ?ప్రజలను అడగకుండా అభిప్రాయం తీసుకోవడంతో ఇలాంటి కీలక నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. రాజేంద్రనగర్ ప్రజల మనోభావాలు తెలుసుకోవాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి లేదా? అన్నారు. ఒకవేళ వేరే వర్గానికి మేయర్ పదవి వెళ్తే, అభివృద్ధి నిధులు, ప్రణాళికలు సమానంగా అందుతాయా? లేక మా ప్రాంతం ప్రజలు పన్నులు కడితే, ప్రగతి వేరే ప్రాంతాలకు మళ్లుతుందా.ఈ పునర్విభజన వెనుక ఎవరి ప్రయోజనాలున్నాయో ప్రజలకు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. రాజేంద్రనగర్‌కు న్యాయం చేయాలి. ప్రజల అభిప్రాయాలను గౌరవించాలి. మా ప్రాంతానికి నష్టం కలిగించే ఏ నిర్ణయాన్నైనా మేము తీవ్రంగా వ్యతిరేకిస్తాం. ప్రభుత్వంలో ఉన్న పెద్దలు మా ప్రాంత ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే, ఈ విలీనాన్ని బహిరంగంగా వ్యతిరేకించాలి.ముఖ్యమంత్రి ని కలిసి స్పష్టమైన హామీ తీసుకురావాలి. లేదంటే ప్రజల్లో అనుమానాలు మరింత పెరుగుతాయిన్నారు.అవసరమైతే కోర్టు ద్వారానైనా న్యాయం సాధిస్తాం. మా అస్తిత్వం, మా రాజకీయ హక్కులు, మా ప్రాంత గౌరవాన్ని కాపాడుకునే వరకు ఈ పోరాటం ఆగదు అన్నారు. కార్యక్రమంలో కొన్నమొల్ల శ్రీనివాస్, కోలాన్ ప్రదీప్ రెడ్డి, మల్లేష్ ముదిరాజ్, జయసింహ, హనుమంతు ముదిరాజ్, వెంకట్ రెడ్డి, రాజేందర్, గుంటి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులకు శాపంగా మారాయి

- **కార్మికులను పర్మినెంట్ చేయాలి**
- **కనీస వేతనం 26 వేల అమలు చేయాలి**
- **ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య**



**రాజేంద్రనగర్, మహా ;** మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ లు కార్మికుల శ్రమ దోపిడీ జరుగుతుంది. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య పేర్కొన్నారు.శంషాబాద్ జోన్ పరిధిలోని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జిల్లా అధ్యక్షులు అన్నెపు ప్రభు ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఓరుగంటి యాదయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో అమల్లో ఉన్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడం కార్మిక ద్రోహం అన్నారు. కార్మికుల శ్రమశక్తిని యజమానులు ఇష్టానుసారంగా దోపిడీ చేయడానికి బీజేపీ ప్రభుత్వం ఈ లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందని మండిపడ్డారు.పని గంటలను రోజుకు 8 గంటల నుండి 12 గంటలకు పెంచడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా రూపొందించిన లేబర్ కోడ్ లు కార్మికుల జీవన భద్రతను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే లేబర్ కోడ్ లను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు కార్మికుల పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, భవన నిర్మాణ కార్మికసంగం రాష్ట్ర నాయకులు శంషాబాద్ మండల కారర్యదర్శి నర్రగిరి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్,ఏఐటీయూసీ మండల కార్యదర్శి గిరక రాజు, సీఐటీయూ మండల కార్యదర్శి కొత్తపల్లి మల్లేష్, భవన నిర్మాణం కార్మిక సంగం మండల కార్యదర్శి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు**

**సిఐటియు జిల్లా నాయకులు విక్రమ్**



**రాజేంద్రనగర్, మహా :** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శంషాబాద్ జోన్ పరిధిలో కార్మిక సంఘాలతో సిఐటియు నాయకులు ఆధ్వర్యంలో మండల తాసిల్దార్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు విక్రమ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికులందరూ సమ్మెలో పాల్గొని మోడీ చేసిన కార్మిక విధానాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమయ్యారు. ఇప్పటికేన కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుల బతుకులను నిర్వీర్యం చేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండేవే చట్టాలను తెచ్చారని మండిపడ్డారు.ఈ ప్రభుత్వాన్ని నమ్ముకున్న పేద ప్రజలు కార్మికులు రోడ్డునపడి లబోదిబోమంటు మొత్తుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అడిగే హక్కు పోతుంది ఈఎస్ఐ పిఎఫ్ సెలవు దినాలు పనిగంటలు యూనియన్ పెట్టుకునే హక్కు లాంటిది ఇవన్నీ ఈ కోడ్ లతో పోతున్నాయి.ముందుగా ఉన్న లేబర్ చట్టాలను అలాగే ఉంచి కార్మికులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవై ప్రణయ్, చందు, సిఐటియు నాయకులు ఎం దర్శన్, మహిళ నాయకురాలు లత, స్వప్న, సంఘం జిల్లా అధ్యక్షులు గణేష్, మల్లేశ్వరి, నళిని, ప్రభావతి, కొత్తపల్లి మల్లేష్, అంగన్వాడి టీచర్స్, ఆయాలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజా వ్యతిరేక బిల్లులను రద్దు చేయాలి'



**ఆమనగల్లు, మహా:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ, ప్రజల హక్కులను కాలరాస్తోందని భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జహంగీర్ విమర్శించారు. గురువారం ఆమనగల్లు మండల కేంద్రంలో దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం, పెయింటర్స్, ఎలక్ట్రిషన్ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాపూజీ భవన నిర్మాణ సంఘం కార్యాలయం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు అక్కడ నుండి బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సమ్మెలో జహంగీర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2025 తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి విబి జీ.రామ్ జీ అని పేరు మార్చడం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసిలో వంద శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించడం దారుణం అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలో వచ్చిన కానుండి రైతులపై, రైతు కూలీలపై, కార్మికులపై, కర్షకులపై దారుణమైన చట్టాలు తీసుకొచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇలాంటి చట్టాలు అమలు అయితే దేశంలో సాధారణ మానవుడు బతికే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉన్నత వర్గాల కొమ్ముకాస్తూ అదానీ, అంబానీకి దేశ సంపద అప్పచెబుతుందన్నారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపై ఉద్యమాలు శరణ్యం అన్నారు. రాబోవు రోజుల్లో వామపక్ష కార్మిక సంఘాలు ఐక్యతతో పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగిళ్ల యాదయ్య, గౌరవ అధ్యక్షులు గంగిశెట్టి సురేందర్, ముఖ్య సలహాదారు ముక్కెరి కృష్ణయ్య, కార్మికులు మల్లేష్, వెంకటయ్య, పర్వతాలు, సీతారాం, రత్నం, రవి, ఎల్లయ్య, నరసింహ, మస్తాన్, సయ్యద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులతో నూతన పాస్టర్స్ అసోసియేషన్ ఆత్మీయ భేటీ



**మొయినాబాద్ మహా :** చేవెళ్ల నియోజకవర్గం పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఇటీవల ఎన్నికైన సందర్భంగా గురువారం చేవెళ్ల నియోజకవర్గం అధికారులతో ఆత్మీయ భేటీ అయ్యారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ, తహాసిల్దార్ ఆర్. కృష్ణయ్య , చేవెళ్ల సీఐ శ్రీధర్ భూపాల్ లను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.నియోజకవర్గం అధ్యక్షుడు దప్పు రమేష్ గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు యోహాను, కార్యదర్శి సుధాకర్, సహాయ కార్యదర్శి ఐజ్జయ్య, కోశాధికారి ఐజాక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో పరస్పర సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.అనంతరం నూతన కార్యవర్గానికి అధికారులు శుభాకాంక్షలు చాటారు.

## ప్రజాసంక్షేమం దిశగా చర్యలు చేపట్టాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**బెల్లంపల్లి, మహా:** ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వ శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని మంచిర్యాల్ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి సందర్శించి డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పనులు,ప్రజా సంక్షేమ పథకాల అమలు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు,ప్రజల సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. కార్యాలయంలోని విభాగాలను పరిశీలించి కార్యాలయ సొంత భవనం నిర్మాణం కొరకు స్థలాన్ని గుర్తించాలని అధికారులకు సూచించారు. బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో గల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలోఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపుకేంద్రాన్నిసందర్శించి ఈ నెల 13వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన త్రాగునీరు, ఇతర ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఓట్ల లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా లెక్కింపు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు.పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో చేపట్టిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను సందర్శించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి తహసిల్దార్ ఎల్. కృష్ణ, బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EDITORIAL
సంపాదకీయం

# భారత అమ్ములపొదిలో రఫేల్

భారత వాయుసేన అమ్ములపొదిలోకి మరో 114 రఫేల్ అస్త్రాలు చేరబోతున్నాయి. గతంలోనే 36 రఫేల్ జెట్లను కొనుగోలు చేసిన భారత్.. వాటిని విజయవంతంగా వినియోగిస్తుండగా.. ఇప్పుడు ఏకంగా లక్షల కోట్ల రూపాయలతో ప్రపంచంలోనే అతిపెద్ద వెపన్ డీల్‌కు రంగం సిద్ధం చేసింది. ముఖ్యంగా 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు కోసం ఫ్రాన్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. కేవలం విమానాల కొనుగోలు చేయడం మాత్రమే కాకుండా 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా వంద విమానాలను స్వదేశీ గడ్డపైనే తయారు చేయడం ఈ ఒప్పందం ప్రత్యేకత. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు వణుకు పుట్టించిన రఫేల్ యుద్ధ విమానాలలు శక్తివంతమైనవిగా రుజువైంది. వీటితో భారత్ కు భారీగా ఆయుధసంపత్తి సమకూరనుంది. రూ..3.25 లక్షల కోట్ల వ్యయంతో ఫ్రాన్స్‌తో అతిపెద్ద రక్షణ ఒప్పందానికి కేంద్ర గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం రక్షణరంగానికి శుభవార్తే. 114 రఫేల్ యుద్ధవిమానాలను కొనుగోలు చేసేందుకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ కౌన్సిల్ ఆమోదించినట్లు ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ నెల 18న భారత పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ డీల్‌కు ఆమోదం లభించినట్లు తెలుస్తోంది. ఈ 114లో 88 సింగిల్ సీట్, 26 ట్విన్ సీట్ వేరియంట్లు భారత వాయుసేన లో విధులు నిర్వర్తించనున్నాయి.



ఈ ఒప్పందం ప్రకారం.. 114 విమానాల్లో సుమారు 100 విమానాలను భారత్‌లోనే తయారు చేస్తారు. దీని కోసం ఫ్రాన్స్‌కు చెందిన డస్సాల్ట్ ఏవియేషన్, భారతీయ దిగ్గజం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరినట్లు సమాచారం. అత్యాధునిక యుద్ధ విమానాల సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్‌కు బదిలీ చేయడంతో పాటు హైదరాబాద్‌లో వీటి విడిభాగాల తయారీ కోసం ఒక అత్యాధునిక కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నారట. ఇదే కనుక జరిగితే 2028 నాటికి ఇక్కడి నుంచే మొదటి ఫ్యూజ్‌లేజ్ (విమాన మధ్య భాగం) సిద్ధం కానుంది. ముఖ్యంగా టాటాడస్సాల్ట్ ఒప్పందంలో భాగంగా హైదరాబాద్‌లోని ప్లాంట్‌లో విమానం వెనుక భాగం, సెంట్రల్ ఫ్యూజ్‌లేజ్ ముందు భాగాలను తయారు చేస్తారు. నెలకు రెండు పూర్తి స్థాయి ఫ్యూజ్‌లేజ్‌లను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తుది అసెంబ్లీ మాత్రం ఫ్రాన్స్‌లోని మెరిగ్నాక్ ప్లాంట్‌లో జరుగుతుంది. ఈ భారీ ఒప్పందం పూర్తయితే.. ఫ్రాన్స్ వెలుపల రాఫెల్‌ను అత్యధికంగా ఉపయోగిస్తున్న దేశంగా భారత్ అవతరిస్తుంది.


### రఫేల్ ఎంతో స్పెషల్

రఫేల్ కేవలం విమానం కాదు.. అది ఒక ఎగిరే మారణాయుధం. ఇప్పటికే భారత వాయుసేన వద్ద ఉన్న 36 విమానాలు.. గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో తమ సత్తాను చాటాయి. అయితే ఇది స్కాల్ప్ క్రూయిజ్ మిస్సైల్స్, మెటియోర్ గగనతల క్షిపణులు, హ్యామర్ వంటి అత్యాధునిక ఆయుధాలను మోసుకెళ్లగలదు. అంతేకాకుండా 250 కిలో మీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్న శత్రువుల స్థావరాలను అత్యంత కచ్చితత్వంతో నేలమట్టం చేయగలదు. అందుకే వీటికి ఇంత డిమాండ్.

# ప్రజల మనిషి బండారు రాజిరెడ్డి

## ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర

బండారు రాజిరెడ్డి 1947 ఫిబ్రవరి 12న జన్మించారు ఉప్పల్ నియోజకవర్గానికి తొలి ఎమ్మెల్యే తాను విద్యార్థి దశ నుండి తుది శ్వాస విడిచే అంతవరకు నమ్మిన సిద్ధాంతం కోసం పాటుపడిన మహనీయుడు గొప్ప మానవతావాది నికర్షణ మనిషి ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే ముక్కుసూటి మనిషి ఆయన చూపించిన ధైర్యం బండారు రాజిరెడ్డి నాయకత్వం విధానాల్లోనే కాదు వ్యక్తిగత ప్రవర్తన లోను కనిపిస్తుంది ఆయన నమ్ముకున్న కార్యకర్తలకు కూడా మంచి చేసినాడు దివంగత మహనేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కి నమ్మిన బంటుగా ఉన్నాడు ఉప్పల్ తొలి అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడింది ఇక్కడి నుండే మొట్టమొదటిసారిగా బండరు రాజిరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంలో ఆయన కనబరిచిన ప్రతిభ ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు ఎప్పుడు మర్చిపోలేరు కోట్లాది రూపాయలు నిధులు తెచ్చి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో ముందంజలో ఉన్నారు ఆయన భౌతికంగా లేకున్నా ఆయనను స్మరించడం అంటే ఆయన చేసిన మంచి పనులే నిబద్ధతకు హుందాతనానికి మంచి పేరుకు ఆయనే నిదర్శనం బండారు రాజిరెడ్డి ఐదుగురు అన్నదమ్ములు బండారు లక్ష్మారెడ్డి ప్రస్తుతం ఉప్పల్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు ఏనాడు కూడా తన వ్యక్తిగత స్వార్థం గురించి ఆలోచించలేదు ఆయన పదిమంది గురించి ఆలోచించి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు ఎంతోమంది ఎమ్మెల్యేలు అవుతారు పోతారు కానీ బండారు రాజిరెడ్డి మాత్రం ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడు ఉప్పల్ నియోజకవర్గంలో మురికివాడలను ఎంపిక చేసి మురికివాడల అభివృద్ధికై ఎనలేని కృషిని చేసినాడు సాయిరాం నగర్ కాలనీలో నీటి కొరత



అత్యధికంగా ఉండేది మందిర పైప్లైన్ ద్వారా త్రాగు నీరు అందించి ప్రజల దాహార్తిని తీర్చగలిగారు రాజీవ్ నగర్ కైలాసగిరి నవోదయ నగర్ కాలనీల అభివృద్ధికి బాటలు వేశారు కైలాసగిరిలో శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం తన సొంత నిధులతో కట్టించి ధర్మాన్ని రక్షించాడు ఇక్కడే అయ్యప్ప స్వాములు మాలలు వేసుకొని బిక్ష కూడా చేస్తుంటారు ఎంతోమందికి ఉపాధిని కల్పించారు సహాయ సహకారాలు అందించి ప్రజలకు నేనున్నానని భరోసాను కల్పించారు బండారు రాజిరెడ్డి ఏది మాట్లాడిన ఏదైనా హామీ ఇస్తే అది అమలయంత వరకు దానికి ఫాలో అయ్యేవాడు ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దగ్గరికి వస్తే తక్షణమే స్పందించి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక మార్గాన్ని చరగొన్నారు గత టిడిపి హాయంలో ఎన్నో కుట్ర కేసులు పెట్టినప్పటికీ ఆ కేసులను ఎదురుకొని న్యాయస్థానాలలో పోరాడుతూనే కాంగ్రెస్ పార్టీ ని అధికారంలోకి తీసుకురావడంలో బండారు రాజిరెడ్డి పాత్ర మర్చిపోలేనిది అనివర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు ప్రయాణించినాడు రాజకీయ జీవితంలో ఎన్ని ఆటుపోట్లు వచ్చినా ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమిస్తూ ముందుకు కొనసాగాడు కాప్రా మున్సిపాలిటీ కి తొలి చైర్మన్ కూడా ఆయనే రైతాంగ సమస్యలపై విద్యార్థుల సమస్యలపై కార్మికుల సమస్యలపై ప్రజా సమస్యలపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తన కళాని వినిపించాడు ఎప్పుడు ప్రజల మధ్యలో ఉంటూనే ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రజానేతగా ఎదిగాడు బండారు రాజిరెడ్డి బాటలోనే తమ్ముడు బండారు లక్ష్మారెడ్డి రాజకీయాలలో కొనసాగుతున్నాడు ఉప్పల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే అయినాడు ఇల్లు లేని నిరుపేదలకు రాజీవ్ గృహకల్ప ద్వారా నివాసాలను అందించారు రేషన్ కార్డులు లేనివారికి రేషన్ కార్డులు అందించడం వైద్యం చేయించుకో లేనటువంటి పేదలకు వైద్య సేవలు అందించడం కుషాయిగూడ జమ్మిగడ్డలో ప్రభుత్వ ఆసుపత్రిని తీసుకురావడంలో రాగిరెడ్డి పాత్ర మరువలేనిది ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజల ప్రజల దరికి చేర్చి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నాడు మానవియా విలువలతో పాటు సమానత్వం న్యాయం పాలనలో బాధ్యత ఇవే రాజకీయ నాయకుడికి ఉండే నాయకత్వ లక్షణాలు బండారు రాజిరెడ్డి ది కథ కాదు మన భవిష్యత్తుకు మార్గదర్శక దీప స్తంభం ఆయన మనకు దూరమై కొద్దికాలం అవుతున్నప్పటికీ ఆయన ప్రజల నాలుకల్లో నానుతున్నాడు అంటే ఆయన చేసిన మంచి పనులే నిదర్శనం బండారు రాజిరెడ్డి 79 వ జయంతి సందర్భంగా స్మరణ లో.

కవి రచయిత
- దామరపల్లి నరసింహారెడ్డి.
95055 55138

# రష్యా, ఉక్రెయిన్ మంకు పట్టు వీడాల్సిందే...

రష్యా, ఉక్రైన్ యుద్ధం ఫిబ్రవరి 22, 2022 లో ప్రారంభమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 22 కు నాలుగేళ్లు పూర్తి అవుతాయి. ఈ మధ్య కాలంలో రెండు దేశాలు తీవ్రంగానే నష్టపోయాయి. రష్యా కంటే ఉక్రెయిన్ భారీగా నష్టపోయింది. ఉక్రెయిన్ లోని కొన్ని ప్రధానమైన నగరాలు రష్యా ధాటికి భారీగా నష్టపోయాయి. అక్కడ పౌర జీవనం స్తంభించి పోయింది. మరు భూమిని తల పిస్తున్నట్లుగా ఉంది. దీనితో అభివృద్ధి కుంటు పడింది. ఉక్రెయిన్ సందర్శించాలి అనుకునే వారు ఇప్పుడు ఎవరూ అంతగా కానరావడం లేదు. దీనితో పర్యాటక రంగం కుదేలు అయింది. అంతేగాక వైద్య విద్య అభ్యసించే విదేశీ విద్యార్థులు ఎవరూ అక్కడ లేరు. విద్యా రంగం సైతం కుప్ప కూలింది. ఉక్రెయిన్ కు యుద్ధం మీదనే ఆసక్తి ఉంది. అభివృద్ధి, పౌరుల సంక్షేమ, అభ్యున్నతి ఏ మాత్రం లేదన్నది తెలుస్తోంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఆపాలని ఎన్నో ప్రయత్నాలు చేసినా అవి ఒక కొలిక్కి రాలేదు. యుద్ధం ఆగాలని తాజాగా అబుదాభి లో ట్రంప్ నేతృత్వంలో సాగే చర్చలు రెండిటికి ఒక శాంతి సందేశం ఉండే అవకాశం ఉంది. ఈ యుద్ధం ఆగాలని ట్రంప్ రెండు దేశాల పట్ల చర్చలు నడిపిన సందర్భాలు ఉన్నాయి. ట్రంప్ చేసే సూచన ఏదైనా రెండు అంగీకరించవలసి ఉంది. అయితే ఉక్రెయిన్ పరిస్థితి అర్థం కావడం లేదు. రెండు దేశాల మధ్య ప్రధాన అవరోధం 'డాన్ బాస్' వీడాలని రష్యా అంటోంది. అయితే అందుకు ఉక్రెయిన్ ససేమిరా అనట్లుగా ఉంది. 'డాన్ బాస్' ఒక పారిశ్రామిక నగరం అది ఎంతో అభివృద్ధి కూడా చెందింది. ఇది మా పరం చేయాలి అప్పుడే యుద్ధం ఆపుతామని రష్యా చెబుతోంది. అయితే ఉక్రెయిన్ అందుకు సుముఖంగా లేదు. మరి ట్రంప్ రాయభారం ఎలా ఫలిస్తుందో అంతు చిక్కడం లేదు. ఇప్పుడున్న పరిస్థితులను బట్టి చుస్తే యుద్ధం ఎంత మాత్రం ఏ దేశానికి తగదు. ఇప్పటికే ఉక్రెయిన్ లోని ప్రధానమైన నగరాలు దెబ్బ తిన్నాయి. మరికొన్నిటిలో జన సంచారమే లేకుండా పోయింది. అక్కడ దృశ్యాలు 'మరు భూమి' ని తలపి స్తున్నాయి. యుద్ధం పట్ల పౌరులు విసుగు చెందుతున్నారు. ఒక వినోద కార్యక్రమం జరుపుకోవాలన్నా ప్రజలు భీతిళ్ళుతున్నారు. పోయిన ఏడాది డిసెంబర్ 25 న కూడా ఉక్రెయిన్ డ్రోన్ ల దాడికి గురయింది.. కనుక ఉక్రెయిన్ ప్రజల కోసమైనా మంకు పట్టు వీడాలి. ట్రంప్ కూడా డాన్ బాస్ ను వదులు కొమ్మని చెప్పవచ్చు. దానికి ఉక్రెయిన్ సమ్మతించాలి. ఉక్రెయిన్ లో భస్మి పటలమైనా నగరాలకు రష్యా సహా యం చేయాలి. దానికి అమెరికా కూడా తన వంతు సహకారం అందించాలి. ఒక సమగ్రమైన విధానం ట్రంప్ ఇరు దేశాలకు సూచన చేస్తాడని కోరుకుందాం. కాని ఎట్టి పరిస్థితి లోను, 'డాన్ బాస్' ను వదులుకోమని జెలెన్ స్కీ మంకు పట్టు పట్టాడు. అటు రష్యా కూడా 'డాన్ బాస్' తమ పరం చేయాలని మంకు పట్టు పడుతోంది. ఇద్దరికీ నచ్చజెప్పే ప్రక్రియ ట్రంప్ నెత్తికెత్తుకున్నాడు. ఎందుకంటే అమెరికా, రష్యా రెండు అభివృద్ధి, మరియు పెద్ద దేశాలు. అందులోను ఐక్యరాజ్య సమితి లోని భద్రతా మండలిలో అమెరికా, రష్యా శాశ్వత సభ్య దేశాలు. ముఖ్య సమాచారం పై రెండు దేశాలు పదే, పదే కలుస్తు వుంటాయి కూడా. కనుక ట్రంప్ ఇద్దరికీ ఆమోదయోగ్యమైన శాంతి చర్చలు జరుపుతాడని భావించవచ్చు. ఏతా వాత అటు ఉక్రెయిన్, ఇటు రష్యా మంకు పట్టు వీడాలి. కనీసం అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యంగా పౌరుల కోసం ఇవి రెండు కలసి పోయి శాంతిని పూయిస్తే విశ్వం సంతోషిస్తుంది. ఈ రెండు దేశాలను ఐక్యం చేయడంలో నిజంగా డోనాల్డ్ ట్రంప్ కృషి ఫలిస్తే ఆయన పేరు మారు మో గుతుంది. నిజమైన శాంతి నేతగా నిలుస్తాడు.


- కనుమ ఎల్లారెడ్డి, 93915 23027

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

# నల్లమల మద్దిమడుగులో సేవాలాల్ విగ్రహం వద్దు

## చెంచు ప్రజల బ్రతుకులకు భద్రత కల్పించండి

ఈ దేశ మూలవాసులు ఆదిమా తెగకు చెందిన చెంచులు నల్లమల్ల అరణ్య ప్రాంతంలో వేల సంవత్సరాలుగా నివసిస్తున్న ఆదివాసీ తెగ చెంచు ప్రజలు అడవిలోనే జీవితం, అడవితోనే సంస్కృతి, అడవితోనే వారి గుర్తింపు. అలాంటి చెంచు ప్రజల అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు వారికి కావాల్సింది విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పన జీవన ప్రమాణాలు మెరుగుపరచవలసింది పోయి వలసవాదులైన లంబాడా, బంజారాలు కృత్రిమంగా ఆరాధించే సేవాలాల్ విగ్రహం ఏర్పాటు చేయడమంటే చెంచు ప్రజల జీవన విధ్వంసం చేయడమే అవుతుంది. ప్రకృతి ఒడిలో జీవిస్తున్న చెంచు ప్రజల సాంస్కృతి, సాంప్రదాయాలు, భాష, కలలను, సామాజిక, ఆచారాలను రక్షిస్తూ వారి బ్రతుకులకు భద్రత కల్పించాలి. మనిషిని మహా ఋషిగా చిత్రీకరించిన లంబాడా, బంజారాలు సేవాలాల్ విగ్రహాన్ని మన్ననూరు ఏజెన్సీ ప్రాంతమైన మద్దిమడుగు చెంచుపెంట, పదర మండలం, నాగర్ కర్నూలు జిల్లా ఆదివాసి చెంచు ఆరాధ్యుడు అభయ ఆంజనేయ స్వామి పురాతన ఆలయం వద్ద 122 అడుగుల ఎత్తైన సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటుకు 22 ఎకరాల భూమిని సేకరించే పనిలో ఇప్పటికే అధికార యంత్రాంగం నిమగ్నమైన విషయం విధితమే. దానిలో 5 ఎకరాల భూమి గ్రామకంఠ మరో 17 ఎకరాల భూమిని స్థానిక చెంచు, ఇతర రైతుల వద్ద నుండి బలవంతంగా సేకరించేందుకు చెయ్యని ప్రయత్నం లేదు. చూపని ఆశ లేదు. పెట్టని భయం లేదు. ఎందుకంటే ఈ నెల 15న తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సేవాలాల్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమానికి ముహూర్తం ఖరారు అయినందున మద్దిమడుగు చెంచు పెంట పరిసర ప్రాంతాలలో అధికార యంత్రాంగం వల సవాదులు హడావుడి అంతా ఇంతా కాదు. అడవికి ప్రకృతికి ఆదివాసి చెంచు ప్రజలకి సంబంధం లేని సేవాలాల్ విగ్రహాన్ని మద్దిమడుగులో ఏర్పాటు చేసేందుకు చూపే శ్రద్ధ... ప్రభుత్వం నల్లమల్ల బిడ్డలైన చెంచుల అభివృద్ధికి కృషి చేయాలి.



ప్రస్తుత కాలంలో చెంచు ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. అడవిని కాపాడిన వారే అడవిలో హక్కులు లేకుండా జీవించాల్సిన పరిస్థితి నెలకొంది. అటవీ హక్కుల చట్టం-2006 ఉన్నప్పటికీ, చాలామంది చెంచులకు ఇప్పటికీ భూమి హక్కుల పట్టాలు లేవు. అటవీ ఉత్పత్తులపై సంపూర్ణ హక్కులు లేకపోవడం వల్ల వారి సంప్రదాయ ఉపాధులు నశిస్తున్నాయి. అందువల్ల చెంచుల అభివృద్ధికి మొదటి అడుగు అడవిపై చట్టబద్ధమైన హక్కుల అమలు కావాలి.

ఉపాధి రంగంలో కూడా చెంచులు తీవ్ర వెనుకబాటులో ఉన్నారు. తేనె, చింతపండు, ఔషధ మొక్కలు వంటి అటవీ ఉత్పత్తులు వారి ప్రధాన జీవనాధారం. కానీ వీటికి సరైన ధరలు లభించకపోవడం, మధ్యవర్తుల దోపిడీ వల్ల చెంచులు లాభపడటం లేదు. ప్రభుత్వం నేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, విలువ జోడింపు శిక్షణ ఇచ్చినట్లయితే చెంచులకు స్థిరమైన ఆదాయం లభిస్తుంది. అలాగే అటవీ సంరక్షణ పనుల్లో చెంచులకు శాశ్వత ఉద్యోగాలు ఇవ్వడం అవసరం.

విద్య విషయానికి వస్తే, చెంచు పిల్లలు చదువు పేరుతో తమ సంస్కృతికి దూరమవుతున్నారు. ఆశ్రమ పాఠశాలలు అడవికి దగ్గరగా ఉండాలి. చెంచు భాష, సంప్రదాయాలను గౌరవించే విధంగా విద్యా విధానం ఉండాలి. చదువుతో పాటు జీవన నైపుణ్యాలు నేర్పితేనే ఆ విద్య వారికి ఉపయోగపడుతుంది.

ఆరోగ్య రంగంలో కూడా చెంచులు నిర్లక్ష్యానికి గురవుతున్నారు. దూరపు ఆసుపత్రులు వారికెంత మాత్రం ఉపయోగపడవు. అడవుల్లో మొబైల్ హెల్త్ యూనిట్లు, పోషకాహార పథకాలు, సంప్రదాయ వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మాత్రమే వారి ఆరోగ్య సమస్యలు పరిష్కారమవుతాయి.

అభివృద్ధి పేరుతో అడవిని నాశనం చేయడం మరో పెద్ద సమస్య. రోడ్లు, భవనాలు అవసరమైన చోట మాత్రమే, పర్యావరణానికి హాని కలగకుండా ఉండాలి. చెంచుల జీవన విధానానికి అనుగుణంగా నివాసాలు, తాగునీరు, సౌర విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించాలి.

ముఖ్యంగా, చెంచు ప్రజలకు సంబంధించిన ఏ నిర్ణయమైనా వారి అంగీకారంతోనే జరగాలి. గ్రామ సభలకు నిజమైన అధికారాలు ఇవ్వాలి. వాళ్లపై నిర్ణయాలు తీసుకోవడం కాదు, వాళ్లతో కలిసి నిర్ణయాలు తీసుకోవడమే నిజమైన అభివృద్ధి. ఆదివాసి చెంచు ప్రజలకు కావాల్సింది విగ్రహాలు కాదు. వారి భూమి హక్కులు, జీవనోపాధి, విద్య, ఆరోగ్యం, గౌరవం. అడవిని కాపాడిన చేతులకే భద్రత కల్పించినప్పుడే, చెంచు ప్రజల అభివృద్ధికి నిజమైన నిదర్శనంగా చెప్పవచ్చు.

- డాక్టర్ సాగబోయిన పాపారావు,
ఆదివాసీ విద్యార్థి సంఘం,
రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు,
99898 28774

# నేడే మున్సిపల్ ఎన్నికల ఫలితాలు

- టీటీడీసీలో కౌంటింగ్
- ఉదయం 8గంటలకు మొదలు
- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగియంతో ఇక ఓట్ల లెక్కింపుపై జిల్లా అధికార యంత్రాంగం ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియను ఆదిలాబాద్ పట్టణంలోని టీటీడీసీ కేంద్రంలో ఏర్పాటు చేశారు. రేపటి లెక్కింపునకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు ఎన్నికల సిబ్బంది పూర్తి చేశారు. సిబ్బందికి శిక్షణ సైతం అందించారు. కౌంటింగ్ నోడల్ ఆఫీసర్లు, రిటర్నింగ్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, రో ఇంచార్జిలు ,ఇతర సిబ్బందిని నియమించారు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. టీటీడీసీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ హాళ్లు, భద్రతా ఏర్పాట్లు, బారికేడింగ్, వెలుతురు తదితర సదుపాయాలను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శుక్రవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. మొత్తం నాలుగు హాళ్లలో కౌంటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 49 వార్డులకు గాను ఒక్కో వార్డుకు ఒక్కో టేబుల్ చొప్పున 49 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇక్కడ సుమారు 180 మంది శిక్షణ పొందిన సిబ్బంది విధులు నిర్వహించనున్నారని తెలిపారు. ఒక్కో టేబుల్ వద్ద మూడు రౌండ్ల లెక్కింపు ఉంటుందని, ప్రతి రౌండ్‌కు సుమారు 90 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, వేగం కంటే ఖచ్చితత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం 2 గంటలలోపు ఫలితాలు వెల్లడయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్ మాట్లాడుతూ, పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించినట్లే కౌంటింగ్‌ను కూడా క్రమశిక్షణతో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద సిబ్బంది, ఏజెంట్లకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అధికారులు రాథోడ్ రవీందర్, రమేష్, ఫణీందర్ తదితర రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భీమన్న సన్నిధిలో మహాజాతర మహోత్సవం

**భక్తిశ్రద్ధల సందడి మధ్య ఘనంగా ఏర్పాట్లు.. ఈనెల 14 నుంచి 16 వరకు వైభవంగా ఉత్సవాలు... లక్షలాది మంది భక్తుల రాకకు అంచనా**





**వేములవాడ,మహా:** ప్రసిద్ధ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు.ఈనెల 14వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్,మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆలయ పరిసర ప్రాంతాలు ఇప్పటికే విద్యుద్దీపాలతో ముస్తాబయ్యాయి.ప్రధాన గర్భగుడి నుంచి రాజగోపురం వరకు ప్రత్యేక అలంకరణలు చేపట్టారు.జాతర రోజుల్లో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలో నిలబడే పరిస్థితి ఉంటుందని భావించి, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అలాగే ముఖ్యంగా మహాశివరాత్రి రోజున ఉదయం 2.30 నుండి 3.30 వరకు ప్రజా ప్రతినిధులకు, స్థానిక అధికారులకు దర్శనాలు, తెల్లవారుజామున 3.30 వరకు పట్టణ వాసులకు దర్శనాలు,4 నుంచి 5.30 వరకు శివ దీక్ష స్వాములకు దర్శనాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఆలయ చరిత్రలోనే మొట్ట మొదటి సారిగా భీమన్న ఆలయంలో ఉత్సవాలకు అధికారులు ఏర్పాటు చేశారు. రాజన్న ఆలయ విస్తరణలో భాగంగా అక్టోబర్ 11న దర్శనాలను భీమన్న ఆలయానికి మార్చారు. దీంతో అప్పటినుండి భక్తులు భీమన్న ఆలయంలోని దర్శనాలు చేస్తూ వస్తున్నారు. మహాశివరాత్రి సమీపిస్తున్న నేపథ్యంతో అధికారులు భీమన్న ఆలయంలో అంగరంగ వైభవంగా ఉత్సవాలను ఏర్పాటు చేస్తున్నారు.

**భద్రతా చర్యలు కట్టుదిట్టం**

భక్తుల రద్దీ దృష్ట్యా జిల్లా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. సుమారు 300 మంది పోలీసు సిబ్బందితో పాటు ప్రత్యేక బృందాలు విధుల్లో పాల్గొంటున్నాయి.,సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ, ట్రాఫిక్ డైవర్షన్లు,ప్రత్యేక పార్కింగ్ స్థలాలు,మహిళా భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు,తప్పిపోయిన పిల్లల కోసం సహాయ కేంద్రం అత్యవసర పరిస్థితుల కోసం కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశారు.

**జాతర ప్రాంతంలో వ్యాపార సందడి**

జాతర నేపథ్యంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో తాత్కాలిక దుకాణాలు, పూజా సామగ్రి విక్రయ కేంద్రాలు, ఆటవస్తువుల స్టాళ్లు ఏర్పాటు అయ్యాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి వ్యాపారులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.మిఠాయిలు, ప్రసాదాలు, పూజా సామగ్రి విక్రయాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. జాతర స్థానిక వ్యాపారులకు ఆదాయ వనరుగా మారింది.

**భక్తుల కోసం ప్రత్యేక సదుపాయాలు**

మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పరిశుభ్రత పనులు ముమ్మరం చేశారు. తాగునీటి ట్యాంకర్లు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. వైద్యశాఖ ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర చికిత్స సదుపాయం కల్పిస్తోంది.విద్యుత్ శాఖ అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకుంది.

**జాతరతో ప్రాంత ఆర్థిక వ్యవస్థకు ఊతం**

జాతర రోజుల్లో దేవస్థానానికి భారీ ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. హోటళ్లు, లాడ్జీలు, రవాణా రంగం, చిన్నచిన్న వ్యాపారులు ఈ జాతరపై ఆశలు పెట్టుకున్నారు.భక్తుల రాకతో పట్టణం మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. వీధులన్నీ విద్యుత్ దీపాలతో మెరుస్తూ సందడిగా మారాయి. ప్రత్యేక బాక్స్ ఐటెమ్భక్తులు గమనించవలసిన సూచనలు, క్యూలైన్లలోనే దర్శనం పొందాలి. నిషేధిత వస్తువులు తీసుకురావద్దు. పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి.

# భూములు కోల్పోయిన రైతులకు ఆర్బిట్రేషన్ పూర్తి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా ;** వరంగల్ జిల్లా కలెక్టర్ చాంబర్లో గురువారం గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే లో భూములు కోల్పోయిన సంగెం మండలం లోని రైతులతో జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారద ఆధ్వర్యంలో ఆర్బిట్రేషన్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన 8 మంది రైతుల ఆర్బిట్రేషన్ పూర్తయిందని తెలిపారు.ఈ ఆర్బిట్రేషన్ లో వరంగల్ ఆర్డీవో సుమ, సంగెం తహసిల్దార్ రాజ్ కుమార్ కలెక్టరేట్ పర్యవేక్షకులు విశ్వ ప్రసాద్, సంబంధిత రైతులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు 250 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు



**వేములవాడ,మహా:** ఓట్ల లెక్కింపు సందర్భంగా 163 BNSS(144సెక్షన్అమలు),విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధము,నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవు, మున్సిపల్ఎన్నికలఓట్లలెక్కింపుసందర్భంగా సిరిసిల్ల,వేములవాడలలో ఏర్పాటు చేసిన కౌటింగ్ కేంద్రాల వద్ద 250 మంది పోలీస్ లతో పటిష్టబందోబస్తుఏర్పాటుచేశామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు..మున్సిపల్ ఓట్లలెక్కింపు సందర్భంగాఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత నిర్వహిస్తున్నామని,ఎలాటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా163 BNSS (144 సెక్షన్ ) అమలుచేస్తున్నామన్నారు.ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్,కండక్ట్(MCC)అమలులోఉందని ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం,గెలిచిన అభ్యర్థులు,వారి అనుచరులు విజయోత్సవర్యాలీలు,సభలు,బైక్ర్యాలీలు నిర్వహించడం,డీజే కార్యక్రమాలు ఏర్పాటు చేయడం,టపాకాయలు కాల్చడం,భారీగాగుంపులు,గుంపులుగాగుమికూడటం,ఫంక్షన్, హాల్స్‌లోసమావేశాలు ఏర్పాటు చేయడంపూర్తిగా నిషేధం అన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఆంక్షలను ప్రతిఒక్కరు తప్పనిసరిగా పాటించాలని,ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన తీసుకుంటాని జిల్లా ఎస్పీ తెలిపారు..



# ఆదిలాబాద్ పీఠాన్ని హస్తగతం చేసుకుంటాం

**నరేష్ జాదవ్-కంది శ్రీనివాస రెడ్డి**

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ మున్సిపల్ పీఠాన్ని తప్పకుండా కైవసం చేసుకుంటామని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ ,అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గుర్తుపై పోటీచేసిన పార్టీ అభ్యర్థులతో గురువారం పట్టణం లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా ఓటింగ్ జరిగిన తీరు గురించి చర్చించారు. .తప్పకుండా గెలుస్తామన్న ధీమాను వ్యక్తం చేసారు. అనంతరం కౌంటింగ్ టెన్షన్ నుండి రిలీఫ్ గా ఉండేందుకు అభ్యర్థులను ప్రత్యేక వాహనాల్లో శిబిరాలకు తరలించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పాటు పోటీ చేసిన అభ్యర్థులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహన దొంగలు అరెస్టు

- పోలీసుల అదుపులో ఏడుగురు నిందితులు..
- 15 లక్షల విలువ చేసే 15 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్



**వరంగల్ హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి తో పాటు హైదరాబాద్ నగరంలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యుల ముఠాను సంగెం, సిసి ఎస్ పోలీసులు సంయుక్తంగా కలసి గురువారం అరెస్టు చేసారు. పట్టుబడిన వారిలో నలుగురు మైనర్లు కూడా వున్నారు. ఈ ముఠా నుండి పోలీసులు సుమారు 15లక్షల విలువ గల 15 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో నలుగురు మైనర్ నిందితులు కాగా, మరో ముగ్గురు నిందితులు దరాంగుల అంజీ, తండ్రి పేరు రవి, వయస్సు 21, హనుమకొండ, ఉర్సు సంతోష్, తండ్రిపేరు లింగయ్య, వయస్సు 27, జైదా రామక్రిష్ణ, తండ్రి పేరు రాజయ్య, వయస్సు 32, జమ్మికుంట, కరీంనగర్ జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.ఈ అరెస్టుకు సంబంధించిన పూర్తి వివరాలు ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ వివరాలను వెల్లడిస్తూ.. కేసులో పట్టుబడిన వారు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పాటు ఒకే ప్రాంతంలో నివాసం వుండటంతో, తరుచుగా కలుసుకునేవారు. దీంతో వీరి మధ్య స్నేహం కుదరటంతో నిందితులందరు వారికి వచ్చే అదాయంతో మద్యం సేవిస్తూ జల్సాలు చేసేవారు. దీనితో వారి అదాయం వారి జల్సాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇందుకోసం ఈ ముఠా పార్కుచేసి వున్న ద్విచక్ర వాహనాలను చోరీ చేసి వాటిని విక్రయించడం ద్వారా వచ్చే డబ్బుతో జల్సాలు చేయాలని అనుకున్నారు. దీంతో నిందితులందరు ఓ ముఠాగా ఏర్పడి వరంగల్ కమిషనరేట్ పరిధి తో పాటు, హైదారబాద్ నగరంలో తాళం వేసి వున్న ద్విచక్ర వాహనాలను చోరీ చేసి హన్మకొండ పద్మాక్షమ్మ గుట్ట ప్రాంతంలో రహస్యంగా భద్ర పర్చేవారు. ఈ తరహాలో నిందితులు మొత్తం 15 చోరీలకు పాల్పడగా ఇందులో సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు చోరీలకు పాల్పడగా, సంగెం, హసన్పర్తి, మీల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు చోప్పున ఆరు చోరీలకు పాల్పడగా , హన్మకొండ ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకటి చోప్పున, హైదరాబాద్ మడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలను నిందితులు చోరీ చేసారు.ఈ నెల ఒకటవ తేదీన సంగెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆశాలపల్లి గ్రామంలో ఒక ద్విచక్ర వాహనాన్ని నిందితులు చోరీ చేయడంతో, ఈ చోరీ పై వాహన యజమాని సంగెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు, అధికారుల అదేశాలతో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టగా పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకోని నిందితులను గుర్తించారు. గురువారం ఉదయం గవిచర్ల గ్రామ గుండు సమ్మయ్య ఆలయం వద్ద ఎస్.ఐ వంశీ కృష్ణ అధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుందగా చోరీ చేసిన రెండు వాహనాల పై ఆరుగురు నిందితులు ప్రయాణిస్తూండగా అనుమానంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకోని విచారించగా నిందితులు పాల్పడిన చోరీలను పోలీసుల ఎదుట అంగీకరించారు. నిందితులు ఇచ్చిన సమచారంతో పద్మాక్షి గుట్ట ప్రాంతంలో రహస్యంగా భద్రపర్చిన మిగితా ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# మున్సిపల్ పోరు తుది ఘట్టానికి సర్వం సిద్ధం..

- నేడే ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం..
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్..
- కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు..



పక్కాగా ఏర్పాట్లు పకడ్బందీగా శిక్షణ..

**నల్గొండ మహా :** నల్గొండ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల తుది అంకానికి రంగం సిద్ధమైంది జిల్లాలోని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ సహా ఇతర మున్సిపాలిటీల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ వెల్లడించారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని ఆర్జాలబావి వద్ద ఉన్న స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ గోదాములను నాగార్జునసాగర్ రోడ్డులోని శ్రీ రామానంద తీర్థ ఇన్‌స్టిట్యూట్ సమీపంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల కౌంటింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల ఓట్ల లెక్కింపును మూడు ప్రధాన కేంద్రాల్లో చేపట్టనున్నారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్జాలబావి స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ గోదాములు, మిర్యాలగూడ, నందికొండ, హాలియా మిర్యాలగూడ అవంతిపురం మార్కెట్ యార్డులో,దేవరకొండ, చండూరు, చిట్యాల నిడమనూరు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఓట్ల లెక్కింపు సాగుతుందని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు.ప్రతి వార్డుకు ఒక కౌంటింగ్ టేబుల్ చొప్పున ఏర్పాటు చేశారు.ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఇద్దరు సూపర్వైజర్లు విధుల్లో ఉంటారు. వీరితో పాటు రిటర్నింగ్ అధికారులు (RO) పర్యవేక్షిస్తారు.తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి, అనంతరం రెగ్యులర్ ఓట్ల లెక్కింపు చేపడతారు. వార్డుల సంఖ్య, పోలింగ్ కేంద్రాల ఆధారంగా రౌండ్ల వారీగా ఫలితాలను వెల్లడిస్తారు. శుక్రవారం (13వ తేదీ) ఉదయం 8 గంటలకే లెక్కింపు ప్రారంభం కానుంది. కౌంటింగ్ కేంద్రాల లోపలికి మొబైల్ ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బారికేడింగ్ ఏర్పాటు చేయడమే కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు వివరించారు. లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని ఆయన కోరారు.ఈ తనిఖీ కార్యక్రమాల్లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

# ఒకరోజు దేశవ్యాప్త సమ్మె జయప్రదం

**సింగరేణి, మున్సిపల్, ఆటో డ్రైవర్ల మద్దతు**



**మంచిర్యాల, మహా :** నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 12 న జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన ఒకరోజు దేశవ్యాప్త సమ్మె మంచిర్యాల జిల్లాలో జయప్రదం అయ్యింది. ఈ సమ్మెకు సింగరేణి, మునిసిపాలిటీ, ఆటో కార్మికులు మద్దతు పలికారు. వీరి సమ్మెతో శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి బొగ్గు గనులు మూతపడ్డాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ 29 చట్టాలను 4 లేబర్ కోడులుగా అమలు చేయడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. అందులో భాగంగానే దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చామని అన్నారు. ఈ సమ్మెలో సుమారు 30 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికులు పాల్గొన్నారని వెల్లడించారు. రెండవసారి కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంటులో 29 చట్టాలను 4 లేబర్ కోడులుగా చేసి కార్మికులను కట్టు బానిసలుగా మార్చేసే కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎందరో కార్మికుల ప్రాణ త్యాగాల వల్ల పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాలను 12 గంటలుగా మారుస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను విదేశీ స్వదేశీ పెట్టుబడిదారులకు అమ్ముకుంటున్నారని వారు ధ్వజమెత్తారు. తక్షణమే 4 లేబర్ కోడ్ విధానాలను వెనక్కు తీసుకొని పోరాడి సాధించుకున్న 29 చట్టాలనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయని క్రమంలో కార్మికుల ఆందోళనలు, నిరసనలు నిరవధిక సమ్మె చేసి హక్కులు సాధించుకుంటామని తేల్చి చెప్పారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి, ఐ ఎన్ టి యు సి, సిఐటియు, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల అభ్యర్థుల్లో ఉత్కంఠ



**బెల్లంపల్లి మహా:** బెల్లంపల్లి మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. అభ్యర్థుల గెలుపోటములలో సర్వత్ర సంబంధిత ఆయ వార్డులోని అనుచర గణం చర్చించుకుంటున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీలు అన్ని వార్డుల్లో అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దింపింది.బిజెపి పార్టీ మాత్రం 20, స్థానాలలో సిపిఐ పార్టీ ఆరు స్థానాలలో ఆయా వార్డుల్లో పోటీకి అభ్యర్థులను రంగంలోకి నిలిపింది. అయితే జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో ప్రధానంగా టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల అభ్యర్థుల మధ్యనే గెలుపు ఉండనున్నాయి మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో పోటీ పడనున్నాయనడంలో అతిశయోక్తి లేదు. ఇరు పార్టీలకు బెల్లంపల్లిలో జరిగిన ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారనున్నాయి.అయితే చైర్మన్ పీఠంపై ఇరు పార్టీలు సమీకరణాలు చేసి బల్దియా పీఠంపై జెండా ఎగురవేయాలని ఆశిస్తున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పాలనను చేజిక్కించుకునేందుకు ఇరు పార్టీలు తీవ్రంగా ఎన్నికల ప్రచారంలో వ్యూహప్రతివ్యూహాలను రచించాయి.. ఇరు పార్టీలకు మెజార్టీ స్థానాలు దక్కుతాయని ఆలోచనతో చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు పథకాలు రచిస్తున్నాయి. అయితే మెజారిటీ స్థానాలను దక్కించుకోని పక్షంలోనూ సైతం గెలిచిన అభ్యర్థులను తమ వైపు లాక్కునేందుకు ఆర్థిక వ్యూహరచన సైతం కొనసాగించడంతోపాటు సంబంధిత అభ్యర్థులకు సన్నిహితులుగా ఉన్న వారిని సైతం ఉన్న వారితో సమాలోచనలు సైతం కొనసాగించాయి.బ్యాలెట్ బాక్స్ లో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం శుక్రవారం రోజు ఫలితాల ద్వారా బహిర్గతం కానున్నాయి. ప్రధానంగాబెల్లంపల్లి బల్దయాను కైవసం చేసుకునేందుకు అధికార పార్టీ కాంగ్రెస్ రెబెల్స్ అభ్యర్థులు ,స్వతంత్రులుగా పోటీ చేసిన వారిని సైతం మచ్చిక చేసుకునేందుకు ఇదివరకే సమాలోచనలు చేయడం జరిగింది. ఇతర పార్టీల తోపాటు స్వతంత్ర అభ్యర్థులను సైతం తమ వర్గంలో చేర్చుకునేందుకు బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలో సమాలోచనలు కొనసాగించి మచ్చిక చేసుకున్నట్లు బహిరంగ చర్చ కొనసాగుతున్నది. మీరు పార్టీలు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులను ఇప్పటికే ఎంపిక చేసుకున్నట్లుగా బహిరంగ చర్చ కొనసాగుతున్నది. బెల్లంపల్లిపట్టణంలోని బజార్ ఏరియా జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఫలితాలను వెల్లడి చేసేందుకు ఎన్నికల అధికారులు అన్ని రకాల సన్నాహాలను పూర్తి చేయడం జరిగింది. ఫలితాలు వెల్లడయ్యే క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేలా కౌంటింగ్ కేంద్రానికి దగ్గరలో ఉన్న వ్యాపార సముదాయాలను మూసివేయాలని ఎన్నికల అధికారులతో పాటు పోలీస్ శాఖ ఇప్పటికే సూచించింది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేలా ఏసీపి రవికుమార్ తోపాటు బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు, టు రూరల్ సిఐ హనోజ్ పోలీస్ యంత్రాంగంతో సన్నద్ధమయ్యారు శుక్రవారం నాడు కౌంటింగ్ ద్వారా ఫలితాలు వెల్లడి కానునందున బెల్లంపల్లిలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీల లో ఉత్కంఠత నెలకొంది.

# అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే..

**కరీంనగర్ లో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కు పకడ్బందీ ఏర్పాట్లు..**





**కరీంనగర్ మహా :** కరీంనగర్ కార్పొరేటర్ అభ్యర్థుల భవితవ్యం నీరు తేలనుంది.. కరీంనగర్లో కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేశారు. అభ్యర్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఎలాంటి ఇబ్బందులతో తలెత్తకుండా కౌంటింగ్ నిర్వహించేంతలెత్తకుండాసిద్ధం చేశారు. నగరపాలక సంస్థ 66 డివిజన్ కు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. నగరపాలక సంస్థ 2 వ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం రోజు స్థానిక ఎస్ ఆర్ ఆర్ కళాశాలలో కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, సీపి గౌస్ ఆలం సమక్షంలో మాస్టర్ ట్రైనర్లు కౌంటింగ్ అధికారులు సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులకు సిబ్బంది కి ఓట్ల లెక్కింపు విధి విధానాల పై దిశా నిర్దేశం చేశారు. ఓట్ల కౌంటింగ్ ప్రక్రియలో పాటించాల్సిన నిబంధనల పై పలు సూచనలు చేస్తూ... ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... నగరపాలక సంస్థ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎన్నికల సంఘం నియమ నిభందనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ సర్వం సిద్దం చేశామని తెలిపారు. స్థానిక ఎస్ ఆర్ ఆర్ కళాశాల ఇండోర్ స్టేడియంలో శుక్రవారం రోజు ఉదయం 66 డివిజన్లకు సంబంధించిన ఓట్ల లెక్కింపు 8:00 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ సుపర్ వైజర్లు, అసిస్టెంట్ సూపర్ వైజర్లు కలుపుకొని మొత్తం 300 మంది కౌంటింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ కోసం కావల్సిన వసతి సౌకర్యాలు అన్ని కల్పించామన్నారు. పోలీస్ భారీ బంధోబస్తు మద్య ఓట్ల లెక్కింపు జరుగుతుందని స్పష్టం చేశారు. కౌంటింగ్ సెంటర్ లో మొత్తం 66 టేబుల్లు ఏర్పాటు చేశామని తెలిపారు. మొదటగా ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్లను లెక్కించడం జరుగుతుందని... తదనంతరం బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందని తెలిపారు. 1000 ఓట్లకు ఒక రౌండ్ చొప్పున ఫలితాలను వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కౌంటింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కట్టుదిట్టమైన భద్రత..**

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. గురువారం కరీంనగర్ లోని అస్త్ర కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన పోలీస్ బ్రీఫింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.

**నిబంధనలు మరియు భద్రతా చర్యలు**

క్షుణ్ణంగా తనిఖీలు: కౌంటింగ్ కేంద్రం వెలుపల 100 మీటర్ల దూరం నుండే తనిఖీలు ప్రారంభమవుతాయి. అనుమతి పత్రాలు ఉన్న వారిని మాత్రమే క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత లోపలికి అనుమతిస్తారు.

**నిషేధిత వస్తువులు:**

ఏజెంట్లు, అభ్యర్థులు, సిబ్బంది తమ వెంట అగ్గిపెట్టెలు, సిగరెట్లు, వాటర్ బాటిళ్లు, ద్రవ పదార్థాలు, మరియు ఇతర ఫ్లెమబుల్ (మంటలు చెలరేగే) వస్తువులను తీసుకురావడంపై పూర్తిగా నిషేధం విధించారు.

**గుర్తింపు కార్డులు తప్పనిసరి:**

ఎన్నికల కమిషన్ జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు ఉన్న వారికి మాత్రమే ప్రవేశం ఉంటుంది.

**నిరంతర నిఘా:**

కౌంటింగ్ కేంద్రాల వద్ద మరియు నగర వ్యాప్తంగా నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తూ నిఘా ఉంచుతామని సీపీ తెలిపారు.

**విజయోత్సవ ర్యాలీలపై నిషేధం:**

కౌంటింగ్ అనంతరం గెలుపొందిన అభ్యర్థులు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి అనుమతి లేదని సీపీ స్పష్టం చేశారు. డీజే (DJ) వినియోగంపై పూర్తి నిషేధం ఉందని, నిబంధనలు అతిక్రమిస్తే డీజే పరికరాలను సీజ్ చేయడమే కాకుండా సంబంధిత వ్యక్తులపై కఠినమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాల వేళ ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసులకు సహకరించి శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని సీపీ గౌష్ ఆలం కోరారు.

# కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

**సార్వత్రిక సమ్మెలో డిమాండ్ చేసిన వామపక్ష పార్టీలు**



**తొర్రూరు మహా ;** తొర్రూరు పట్టణ కేంద్రంలో దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇందులో సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ప్రజాపంద పార్టీల బాధ్యులు పాల్గొన్నారు. అనంతరం నాయకులు. సిపిఐ రాష్ట్ర నాయకులు, తమ్మెర విశ్వేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మాస్ లైన్ జిల్లా నాయకులు ముంజంపల్లి వీరన్న, సిపిఐ ఎం.ఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఉడుగుల లింగన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రజా పంద, డివిజన్ నాయకులు హెచ్ యాకన్నలు పాల్గొని సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతూ స్వేచ్ఛ వాణిజ్యం పేరుతో బిజెపి మోడీ ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ఒప్పందం దేశవ్యాప్తంగానే వ్యవసాయ రంగాన్ని నాశనం చేస్తుందని, కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను హక్కులను స్వేచ్ఛను హరింప చేస్తుందని చెప్పారు .ఈ పరిస్థితిని అర్థం చేసుకొని ప్రజలు రైతులు కార్మికులు మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, లేకుంటే భవిష్యత్తు అంధకారమే అవుతుందన్నారు. వి.బి .జి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు .ఈ సందర్భంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకోవాలని, కార్మికులకు నష్టకరమైన నాలుగు లేబర్ కోడ్ ల అమలు ను వెనక్కి తీసుకోవాలని, మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి యధావిధిగా కొనసాగించాలని, విత్తన, విద్యుత్తు సవరణ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీ నాయకులు ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఓమా బిక్షపతి, సిపిఐ మండల కార్యదర్శి బంధు మహేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఘనపురం లక్ష్మణ్, సహాయ కార్యదర్శి పేరబోయిన కిరణ్ కుమార్, ముద్రబోయిన వెంకన్న, కోటగిరి యకాంతం, కోటగిరి కృష్ణ,తండా సురేష్ ,బంగారి శీను వాసు గద్దెల వెంకటయ్య మహమ్మద్ షరీఫ్ పుల్లయ్య లింగాచారి ,శీను, వేణు బంగారు శ్రీనివాస్, శ్రీరామ్ పుల్లయ్య, గద్దల వెంకటయ్య,యాకయ్య తదితరులు పాల్గొన్నారు.సి ఐ టీ యూ సి ఆధ్వర్యంలోసిఐటియుసి ఆధ్వర్యంలో చేపట్టిన సందర్భంగా పట్టణంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు నాలుగు నల్ల చట్టాలను రద్దు చేయాలని దేశవ్యాప్త సారవధిక సమ్మె లో భాగంగా తొర్రూర్ గాంధీ సెంటర్లు సిఐటియు వ్యాకాస రైతు సంఘం ప్రజాసంఘాల పిలుపులో భాగంగా ర్యాలీగా వచ్చి రాస్తారోకో చేయడం జరిగింది ఈ సమ్మెలో అంగన్వాడి టీచర్స్, ఆశా వర్కర్, ఉపాధి హామీ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు ఈ సమ్మెలో భారత కార్మిక సంఘాల సమాఖ్య బాధ్యులు పాల్గొన్నారు.

# 2వ ఆర్డినరీ మునిసిపల్ కౌంటింగ్ కు ఏర్పాట్లు


**పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా;**రెండవ ఆర్డినరీ మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లలో భాగంగా గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.కౌంటింగ్ హాల్స్‌లో ఏర్పాటు చేసిన టేబుళ్లు, సిబ్బంది నియామకం, భద్రతా ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్ భద్రత, సీసీ కెమెరాల వ్యవస్థ, అభ్యర్థుల ప్రతినిధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. కౌంటింగ్ శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుందని, మొత్తం 3 రౌండ్లలో, 4 టేబుళ్ల ద్వారా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.కలెక్టర్ వెంట డిఆర్డిఓ రాంరెడ్డి, వరంగల్ ఆర్డీఓ సుమ, వర్ధన్నపేట సీఐ కె. శ్రీనివాసరావు, తహసిల్దార్ విజయ్ సాగర్, మునిసిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ తదితర అధికారులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

# హైకోర్టులో అక్రిడిటేషన్ కార్డుల అంశం

**తదుపరి విచారణ ఫిబ్రవరి 26కు వాయిదా**




**వరంగల్ మహా ;** జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ఫిబ్రవరి 28, 2026 తో ముగియనున్న నేపథ్యంలో దాఖలైన పిటిషన్ పై తెలంగాణ హైకోర్టు గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ముఖ్య న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ల తో కూడిన బెంచ్ ఈ వ్యవహారాన్ని విచారించింది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఈ పిటిషన్ను దాఖలు చేసి, అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగియడంతో కలిగే సమస్యలు, అలాగే తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్2025 (జీఓఎంఎస్ నం. 252), తదనంతర సవరణల అమలులో జరిగిన ఉల్లంఘనలను ప్రస్తావించింది. విచారణ సందర్భంగా కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను ప్రతివాదులు అమలు చేయలేదని సమర్పించిన వాదనను గంభీరంగా పరిగణించింది. ఫిబ్రవరి 26, 2026లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించడంతో పాటు, తదుపరి విచారణకు ముందు అన్ని ప్రతివాదులు తమ సమాధానాలను సమర్పించాలని బెంచ్ సూచించింది. సకాలంలో చర్యలు తీసుకోకపోతే అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగియడంతో జర్నలిస్టులు తమ వృత్తిపరమైన ప్రవేశాలను కోల్పోయే ప్రమాదం ఉందని కోర్టు గమనించింది. ఫిబ్రవరి 28 గడువు సమీపిస్తున్న దృష్ట్యా అత్యవసరతను పరిగణనలోకి తీసుకుని, ఈ వ్యవహారాన్ని ముందుకు తీసుకొచ్చి ఫిబ్రవరి 26, 2026కు విచారణను ఖరారు చేసింది. సమానమైన మరో కేసు ఉందని పేర్కొంటూ మార్చి 12 వరకు గడువు ఇవ్వాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరినప్పటికీ, అక్రిడిటేషన్ గడువు దృష్ట్యా కోర్టు ముందస్తు విచారణకు ఆదేశించింది. పెండింగ్లో ఉన్న కేసు పరిష్కారం వరకు ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగియకుండా తగిన ఆదేశాలు జారీ చేయాలని, అలాగే జీఓఎంఎస్ నం. 252, సవరించిన జీఓఆర్ టి నం. 103ను రద్దు చేయాలని ఫెడరేషన్ కోర్టును అభ్యర్థించింది.ఫెడరేషన్ తరఫున న్యాయవాది బర్కత్ అలీ ఖాన్ వాదిస్తూ, అక్రిడిటేషన్ చెల్లుబాటులో అంతరాయం కలగడం భారత రాజ్యాంగం కల్పించిన మాట స్వేచ్ఛ, వ్యక్తి స్వేచ్ఛ, గౌరవప్రద జీవన హక్కులను ఉల్లంఘించడమేనని తెలిపారు. ఇది వందలాది మంది జర్నలిస్టులు, వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డులు మీడియా వర్గాలకు కీలక సంస్థాగత రక్షణగా పనిచేస్తాయని, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 16, 19, 21లకు విరుద్ధమని, అలాగే ప్రభుత్వ స్వీయ నియమాలకు కూడా విరుద్ధమని ఆయన వాదించారు. రాష్ట్రంలో అక్రిడిటేషన్ కార్డుల అమలు, చట్టబద్ధత, పునరుద్ధరణ వ్యవస్థపై న్యాయస్థానం నిరంతర ఆందోళన వ్యక్తం చేస్తున్నదనడానికి ఈ జోక్యం నిదర్శనంగా నిలిచింది. ఫిబ్రవరి 26, 2026న జరగనున్న తదుపరి విచారణ ఈ వ్యవహారంలో తక్షణ చర్యల దిశను నిర్ణయించే అవకాశముందని తెలుస్తోంది.

# ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

**హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్**



**హన్మకొండ మహా;** పరకాల మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు పరకాల లోని గణపతి డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు నకు 7 టేబుల్స్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. మొత్తం పరకాల మున్సిపాలిటీ పరిధిలో 34 మంది పోస్టల్ బ్యాలెట్ను వినియోగించుకున్నారని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్స్ లను కౌంటింగ్ కేంద్రంలో రౌండ్ల వారిగా ఓట్ల లెక్కింపును చేపడతారు. మొదటి రౌండ్లో 7 వార్డుల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, ఇందులో 1, 15, 12, 6, 9, 17, 4 వార్డుల ఓట్లను లెక్కిస్తారు. రెండో రౌండ్లో 2, 16, 13,7,10, 19,5 వార్డుల ఓట్లను, మూడవ రౌండ్ లో 3, 22,14,8,11, 20,18 వార్డుల ఓట్లను, నాలుగవ రౌండ్ లో 21 వార్డుకు సంబంధించిన ఓట్లను కౌంటింగ్ చేస్తారు. ప్రతి రెండు గంటలకు ఒక రౌండ్ కౌంటింగ్ పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మొత్తం 22 వార్డుల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేసి ఫలితాలు వచ్చే విధంగా ఏర్పాట్లు చేసామని పేర్కొన్నారు. ఇందుకు ఎనిమిది మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 18 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొంటారని తెలిపారు. రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, మైక్రో అబ్జర్వర్లు పరిశీలనలో ప్రతి రౌండ్ వారీగా ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. జిల్లా అదనపు కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్ కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షణ చేస్తారని పేర్కొన్నారు. పరకాల ఏసిపి సతీష్ బాబు ఆధ్వర్యంలో సుమారుగా 127 మంది పోలీసులు ఓట్ల లెక్కింపు సందర్భంగా బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు.

# కార్మిక హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

- సీహెచ్ భాస్కర్ రెడ్డి
- దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఈసీఐఎల్ ప్రధాన ద్వారం వద్ద భారీ నిరసన
- 4 లేబర్ కోడ్ల ఉపసంహరణకు డిమాండ్




**కుషాయిగూడ, మహా :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తూ 4 లేబర్ కోడ్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిహెచ్ భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లో గురువారం స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సీహెచ్ భాస్కర్ రెడ్డి నాయకత్వంలో ప్రధాన ద్వారం వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. "కొత్త 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి", "ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలి", "కార్మికులకు ఉద్యోగ భద్రతకు చట్టబద్ధ హామీ ఇవ్వాలి", "కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలి", "8 గంటల పని దినాన్ని కచ్చితంగా అమలు చేయాలి", "కార్మిక సంఘాల హక్కులను గౌరవించాలి" అంటూ డిమాండ్లు చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల ఐక్యతే బలం అని, పోరాటాల ద్వారానే హక్కులు సాధ్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకొని కార్మికులకు అనుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.నిరసన కార్యక్రమంలో మిత్రపక్ష యూనియన్ నాయకులు డేవిడ్ రాజ్, విజయ్ కుమార్, ప్రవీణ్, గణేష్, సత్యనారాయణ, రాజశేఖర్, శ్రీకాంత్, వీరునాయక్, అజయ్ కుమార్, మహేష్ కాంట్రాక్ట్ కార్మికుల నాయకులు ఆంజనేయులు, తదితరులు సహా పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరయ్యారు.

# బండారి రాజిరెడ్డి జీవితం మార్గదర్శకం కావాలి

**బీఆర్ఎస్ నేత బండారి నీలం రెడ్డి**




**కుషాయిగూడ, మహా :** ఉప్పల్ తొలి ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి జీవితం భవిష్యత్ తరాలకు మార్గదర్శకం కావాలని, ఆయన బతికినన్నిరోజులు పేద ప్రజల కోసం ఆలోచించేవాడని ఆ దిశగానే అడుగులు వేశారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారు నీలం రెడ్డి అన్నారు గురువారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రిపురంలో దివంగత నేత బండారి రాజిరెడ్డి 79 వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బండారు రాజిరెడ్డి ఉప్పల్ నియోజకవర్గానికి తొలి ఎమ్మెల్యే అయ్యాడని చరిత్రలో నిలిచిపోతారని గుర్తు చేశారు చక్రిపురం చౌరస్తాలో పార్టీల కతీతంగా అభిమానులు శ్రేయోభిలాషులు :రాజిరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాలులు అర్పించారు. బీఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు ఎన్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ, మున్సిపల్ చైర్మన్ గా, ఉప్పల్ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డ్ మెంబెర్ గా వివిధ సేవలు అందించిన గొప్ప నాయకుడు అని, పీడిత , బాధిత ప్రజలకు ఎన్నో సేవలు అందించి ప్రజల మనసులో చిరస్థాయిగా నిలి చాడని గుర్తు చేసుకోవడం అని కొనియాడారు.

### సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ పనులు

# త్వరగా పూర్తి చేయాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మహా;** వరంగల్ లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు.గురువారం కలెక్టర్ ఆకస్మికంగా హాస్పటల్ నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించారు. ప్రస్తుతానికి జరుగుతున్న నిర్మాణ పనులు, మిగిలి ఉన్న పనుల స్థితిగతులు గురించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు..పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

# ప్లాంట్ ఏర్పాటుకు ఆర్ఎఫ్‌పిలకు ఆహ్వానం

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**



**వరంగల్ మహా;**నగరం లో బయో మిథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటుకు ఆర్ ఎఫ్ పి లను ఆహ్వానించనున్నట్లు బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. గురువారం ఎన్ఐయుఏ, ఈ డబ్ల్యు సిటీ వారి తో వర్చువల్ గా ఏర్పాటు చేసిన సమావేశం లో కమిషనర్ నగరం నుండి పాల్గొని బయో మిథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటు పై చర్చించారు.ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ నగరం లో బయో మిథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని 100 టి పి డి (టన్స్ పర్ డే) సామర్థ్యం గల బయో మిథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటుకు ఆర్ ఎఫ్ పి లను పిలవాలని ఇందుకోసం అవసరమైన ల్యాండ్ తో పాటు సోర్స్ సెగ్రిగేషన్ చేసే అనుకూలత తో పాటు తడి వ్యర్థాలను సులభంగా తీసుకువచ్చే విధానం ఉండాలని,తడి చెత్త లభించని పక్షంలో ఇతర అంత్య ఉత్పన్నాలు అందుబాటు లో ఉండాలని కమిషనర్ తెలిపారు.ఈ సమావేశం లో సి ఎం.హెచ్ ఓ డా.రాజారెడ్డి ఈ ఈ లు మహేందర్ మాధవి లత డి ఈ సంతోష్ కుమార్ ఏ ఈ సరిత తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి మహోత్సవాల కరపత్రం ఆవిష్కరణ

**కార్పొరేటర్ గుంటేటి నరేంద్ర కుమార్**



వరంగల్ నగరం కాశిబుగ్గ లోని ప్రముఖ ప్రసిద్ధిగాంచిన శ్రీ కాశివిశ్వేశ్వర స్వామి దేవాలయంలో గురువారం మహాశివరాత్రి మహోత్సవాల కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం జరుగింది. ఈ సందర్భంగా పూర్వ ఆలయ అభివృద్ధి కమిటి గౌరవ అధ్యక్షులు 20 డివిజన్ కార్పొరేటర్ గుంటేటి నరేంద్ర కుమార్, తో కలిసి బయ్యాస్వామి మాజి కార్పొరేటర్ కౌన్సిలర్ దూపం సంపత్కర్ గోనె జగదీశ్వర్, ఓరుగంటి కొమురయ్య, బోడకుంట్ల వైకుంఠం,బండారి భాస్కర్, ముచ్చర్ల ప్రభాకర్, తోట బాలరాజు, మార్త ఆంజనేయులు, వలుదాసు గోపి, S. చిరంజీవి, పున్నం తదితరులు పాల్గొని కరపత్రం ఆవిష్కరించారు.



# సీఎంఆర్ రైస్ ను మిల్లర్లు సకాలంలో ఇవ్వాలి

**హన్మకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి**

**హన్మకొండ మహా;** కస్టమ్ మిల్లింగ్ రైస్ సీఎంఆర్ ను రైస్ మిల్లర్లు సకాలంలో ఎఫ్ సి ఐ కి అందజేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ చాంబర్ లో డిఫాల్ట్ రైస్ మిల్లర్లు, టాస్క్ ఫోర్స్ స్పెషల్ ఆఫీసర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ డిఫాల్ట్ రైస్ మిల్లుల యజమానులు ప్రభుత్వానికి చెల్లించే పెనాల్టీలను త్వరగా చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో టాస్క్ ఫోర్స్ స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్ రావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, విజిలెన్స్ సీఐ వసంత్ నాయక్, సివిల్ సప్లై డీటీలు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# చందాపూర్ లో పశు వైద్య శిబిరం



**సంగారెడ్డి ప్రతినిధి: మహా :**సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం పరిధిలోని చందాపూర్ గ్రామంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ మల్లికార్జున్ ఉప సర్పంచ్ మహాలక్ష్మి అరవింద్ ప్రారంభించినారు పాడి పశువులకు పశు వైద్య నిపుణులు డాక్టర్ కళ్యాణి మేడం మరియు డాక్టర్ సంతోష్ కుమార్ గౌడ్ గారు పశువులకు గర్భకోశ చికిత్సలు 18 సాధారణ చికిత్సలో 24 చూడి పరీక్షలు 19 లేక దూడలకు నట్టల నివారణ మందులు 34 ఎద సోదులు మూడు3 డాక్టర్ సంతోష్ కుమార్ గౌడ్ గారు పాడి రైతులతో మాట్లాడుతూ రైతుకు పాడి పశువులు పాలు ఇస్తూ ఉండాలి లేదా చూడి కట్టి అయినా ఉండాలి ఇలా చేస్తే ఒక ఎకరంలో పంట విలువతో సమానము పుట్టిన లేగ దూడలకు నెలకు ఒకసారి ఆరు మాసాలు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు తాపుకోవాలి ఇలా చేస్తే 70% దూడల మరణాలు తగ్గించవచ్చని మరియు రోగాలు రాకమునుపే టీకాలు వేసుకోవాలని ఎదకు వచ్చిన పశువులకు దగ్గర్లో ఉన్న గోపాలమిత్రకు ఫోన్ చేసి యధా సూదులు వేసుకోవాలని మీ పాడి సంపద పెంచుకోవాలని రాబోయే రోజుల్లో పాలకు చాలా డిమాండ్ ఉంటుందని ప్రతి కుటుంబానికి ఒకటి రెండు పశువులు పెంచుకోవాలని ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుందని రైతులకు సూచించారు గోపాలమిత్ర సూపర్వైజర్ సి అర్జునయ్య సిబ్బంది ఎం యాదయ్య కృష్ణ ఆరిఫ్ ఓఎస్ పాడి రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



### అభివృద్ధి పనులకు

# శంకుస్థాపనలు

**కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, మేయర్ కమీషనర్**

**హన్మకొండ మహా;** బల్దియా పరిధి 5 వ డివిజన్ లోని మార్కజీ స్కూల్ వయా కొత్తూరు రోడ్డు నుండి మంగళి వాగు బ్రిడ్జి వరకు జనరల్ ఫండ్ నిధులు రూ.90 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న బి టి రోడ్డు పునః నిర్మాణ పనులతో పాటు, 30 వ డివిజన్ లో బల్దియా స్టాంప్ డ్యూటీ నిధులు రూ.75 లక్షల వ్యయం తో చేపట్టనున్న చిల్డ్రన్ పార్క్ పునరాభివృద్ధి పనులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు పోతుల శ్రీమాన్ రావుల కోమల కిషన్ ఈ ఈ రవికుమార్ మాజీ కార్పొరేటర్ మాధవి రెడ్డి తో పాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మోడీ విధానాలకు వ్యతిరేకంగా

# దేశవ్యాప్త సమ్మెలో కదం తొక్కిన కార్మిక లోకం




**యాదగిరిగుట్ట, మహా:** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జాతీయ కౌన్సిల్ సభ్యులు కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు.గురువారం రోజున కేంద్ర రాష్ట్ర ,కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా యాదగిరిగుట్ట పట్టణంలో సిఐటియు,ఏఐటియుసి ,ఐ ఎన్ టి యు సి ,హెచ్ ఎం ఎస్ ,బి ఆర్ టి యు , టి ఆర్ కె వి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ముందు భారీ రాస్తారోకో నిర్వహించారు లేబర్ కోడ్ లు రద్దు చేయాలి,ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి అని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ గుట్ట పాదాల నుండి పాదయాత్రగా ర్యాలీ నిర్వహించి బస్ స్టాండ్ ముందు రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో CITU జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బారు సత్య నారాయణ అధ్యక్షతన జరిగింది.

**హామీలు అమలు చేయకుంటే తిరుగుబాటు తప్పదు**
**సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు**

**వలిగొండ మహా :** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకుంటే తిరుగుబాటు తప్పదని మలిదశ ఉద్యమకారుడు టియుజెఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనేక పోరాటాల తోటి త్యాగాల తోటి కొట్లాడు తెచ్చుకున్న రాష్ట్రంలో గత ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించినందున ఆ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపామని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు న్యాయం చేస్తామని మేనిఫెస్టోలో పెట్టినందున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి ఉద్యమకారులు కీలకపాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు దాటినప్పటికీ నేటి వరకు ఉద్యమకారుల ఊసే ఎత్తడం లేదని వెంటనే ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా జీవో జారీ చేయాలని లేకుంటే తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు.



# బ్రహ్మోత్సవాలకు సీపీకి ఆహ్వానం

**హన్మకొండ మహా;** రాబోయే శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ పాలకుర్తి సోమేశ్వర శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో నిర్వహించబడే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఆలయ ప్రధాన అర్చకుడు దేవగిరి వెంకట రాజేశ్వర శర్మ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ కు గురువారం సిపి క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతతో పాటు, బ్రహ్మోత్సవాలు సమయంలో జరిగే కార్యక్రమాలను ప్రధాన పూజారి సిపికి వివరించారు.



# టీజీ కార్మిక సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక

**నూతన అధ్యక్షుడిగా చెంచలి వెంకన్న**

**తొర్రూరు మహా:**మండలంలోని రేపోని గ్రామంలో తెలంగాణ కార్మిక సమాఖ్య (టీకేఎస్) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు గ్రామ శాఖ అధ్యక్షులుగా చంచలి వెంకన్న, ఉపాధ్యక్షులుగా చంచల్ నరసయ్య , ప్రధాన కార్యదర్శిగా చర్లపల్లి మోహన్ చందర్ ,సహాయ కార్యదర్శిగా బేతమల్ల దేవయ్య , కోశాధికారిగా మడతపల్లి కృష్ణ,గౌరవ సలహాదారుడుగా బేతమల్ల ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు సందర్భంగా అధ్యక్షులు చెంచలి వెంకన్న మాట్లాడుతూ కార్మిక సంఘంలో అవకాశం ఇచ్చిన సంఘ పెద్ద లందరికీ ధన్యవాదాలు తెలియజేశారు నాకు ఇచ్చిన ఈ కర్తవ్యాన్ని సంఘాన్ని అభివృద్ధి చేస్తూ కార్మికుల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి జెల్ల పరిషరాములు, జిల్లా అధ్యక్షులు దైద సాగర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మారపు వెంకన్న, వెంకట రాములు వెంకన్న వీరంతా గ్రామ కమిటీ నిర్మాణానికి కృషి చేసారు.

### నేడు డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని

# సద్వినియోగం చేసుకోవాలి

**తొర్రూర్ ఆర్టీసీ డిఎం పద్మావతి**

**తొర్రూర్ మహా ;** తొర్రూరు పరిసర ప్రాంత ప్రజలు నేడు నిర్వహించే డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని సద్విని చేసుకోవాలని డిఎం పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫోన్ ఇన్ కార్యక్రమం శుక్రవారం 11 గంటల నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో తొర్రూరు డిపో పరిధిలోని ఆయా రూట్లలోని బస్సుల గురించి మరియు బస్టాండ్ లోని మౌలిక సదుపాయాల గురించి ఫోన్ ద్వారా తెలియజేయగలరు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని డిపో అభివృద్ధికి మీ యొక్క విలువైన సలహాలు సూచనలు ఇచ్చి డిపో అభివృద్ధికి సహకరించగలరని తెలియజేశారు మీరు చేయవలసిన ఫోన్ నెంబర్ 9959226053 లో సంప్రదించాలని కోరారు.



### నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే

# బిల్లుల చెల్లింపులు

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వరంగల్ మహా;**నగరంలో జరుగుతున్న నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు జరుపుతామని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. గురువారం వరంగల్ పరిధి లోని బ్యాంకు కాలనీ, తుమ్మలకుంట, మర్రి వెంకటయ్య కాలనీ అబ్బూస్ ఫంక్షన్ హాల్ ప్రాంతం లో పూర్తి చేసిన అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైన్ లు సి సి రోడ్ లు దీర్ఘ కాలం మన్నికగా ఉండాలంటే పనులు నాణ్యతతో చేపట్టాలని, నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తేనే కాంట్రాక్టర్ లకు బిల్లుల చెల్లింపులు చేస్తామని అన్నారు. తనిఖీల నేపథ్యంలో నిర్మాణ పనుల పట్ల కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏం హెచ్ ఓ డా.రాజేష్ ఈ ఈ సంతోష్ బాబు డి ఈ సతీష్ ఏ ఈ మురళి కృష్ణ సానిటరీ ఇన్స్పెక్టర్ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

### కౌంటింగ్ ప్రక్రియ

# పారదర్శకంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**యాదాద్రి భువనగిరి, మహా:** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కౌంటింగ్ ప్రక్రియను సంబంధిత అధికారులు పారదర్శకంగా బాధ్యతాయుతంగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కు సంబంధించిన అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారుఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల్లో కౌంటింగ్ అనేది చాలా కీలకమైనదన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ననుసరించి ప్రాథమిక మరియు వివరనాత్మ కౌంటింగ్ నిర్వహించాలని , రూల్ 56 ప్రకారం మొదటగా పోస్టల్ బ్యాలెట్ ను లెక్కించాలని తెలిపారు.

# వాట్సాప్ బ్యాన్ చేయడానికే రష్యా ప్రయత్నం?



ప్రపంచవ్యాప్తంగా కమ్యూనికేషన్ యాప్‌లు ప్రజల జీవితంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. వాట్సాప్, టెలిగ్రామ్ వంటివి కోట్లాది మంది వినియోగదారులను కలుపుతున్నాయి. ఇలాంటి సమయంలో.. రష్యా ప్రభుత్వం తమ సేవలను దేశంలో పూర్తిగా బ్లాక్ చేయడానికి ప్రయత్నించిందని వాట్సాప్ వెల్లడించింది. దీనికి కారణం.. ప్రభుత్వం నిర్వహించే 'మ్యాక్స్' సూపర్ యాప్‌ను ముందుకు తీసుకురావడానికే అని పేర్కొంది.

**రష్యా మ్యాక్స్ యాప్**

మ్యాక్స్ అనే యాప్‌ను రష్యా ప్రభుత్వం వీచాట్ (చైనా దేశంలో ప్రసిద్ధి చెందన యాప్) నమూనాను అనుసరించి రూపొందించింది. ఇది కేవలం మెసేజెస్, కాల్స్ చేసుకోవడానికి మాత్రమే కాకుండా.. ప్రభుత్వ సేవలు, డాక్యుమెంట్ స్టోరేజ్ వంటి వాటికి కూడా ఉపయోగపడుతుంది. మనీ ట్రాన్సక్షన్స్ చేయడానికి కూడా ఇది అనుమతిస్తుంది. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న అన్ని స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్లలో ఈ మ్యాక్స్ యాప్‌ను ముందుగానే ఇన్‌స్టాల్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ''రష్యా ప్రభుత్వం వాట్సాప్‌ను పూర్తిగా బ్లాక్ చేయడానికి ప్రయత్నించింది. ప్రజలను ప్రభుత్వ యాజమాన్యంలోని యాప్‌కి నడిపించే ప్రయత్నం చేసింది. అయితే వినియోగదారులను కనెక్ట్ చేయడానికి మేము చేయగలిగినదంతా చేస్తూనే ఉన్నాము'' అని వాట్సాప్ ట్వీట్ చేసింది.

**టెలిగ్రామ్ సేవలు పరిమితం!**

రష్యా ప్రభుత్వం విదేశీ యాప్‌లపై కఠినమైన చర్యలు తీసుకోవడంలో భాగంగానే.. వాట్సాప్, టెలిగ్రామ్ సేవలను పరిమితం చేసింది. టెలిగ్రామ్ కంపెనీ ప్రభుత్వ ఆదేశాలను పాటించడం లేదని, క్రిమినల్ & ఉగ్రవాద కంటెంట్ తొలగించలేదని ఆరోపణలు రావడంతో.. రష్యా కమ్యూనికేషన్ నియంత్రణ సంస్థ రోస్కోమ్నాడ్జర్ టెలిగ్రామ్‌పై పరిమితులు విధించేందుకు చర్యలు చేపట్టింది. అంతేకాకుండా, టెలిగ్రామ్‌పై 64 మిలియన్ రూబిళ్ల జరిమానా విధించే అవకాశం ఉందని సమాచారం.

**మ్యాక్స్ యాప్‌పై విమర్శలు**

ఇక రష్యా ప్రభుత్వం నిర్వహించే.. మ్యాక్స్ యాప్‌పై విమర్శకులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ యాప్ ద్వారా వినియోగదారుల సమాచారం ప్రభుత్వం చేతిలోకి వెళ్లే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఈ ఆరోపణలను కొట్టిపారేసింది. క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ (Dmitry Peskov) ప్రకారం.. వాట్సాప్ రష్యాలో తిరిగి తన సేవలు యథావిధిగా అందించాలంటే, దేశంలోని చట్టాలను పూర్తిగా పాటించాలి. మెటా సంస్థ రష్యా అధికారులతో చర్చలకు సిద్ధంగా ఉంటే.. ఒప్పందం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై మెటా మొండిగా ప్రవర్తిస్తే మాత్రం.. వాట్సాప్ పూర్తిగా కనుమరుగయ్యే అవకాశం ఉందని అన్నారు.

# రెరా బిల్డర్లకే కొమ్ముకాస్తోంది: సుప్రీంకోర్టు



రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత కోసం ఉద్దేశించిన రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) పనితీరుపై సుప్రీంకోర్టు గురువారం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. రెరా సంస్థలు కేవలం బిల్డర్లకు మాత్రమే ప్రయోజనం చేకూరుస్తున్నాయని, కొనుగోలుదారుల ప్రయోజనాలను గాలికి వదిలేస్తున్నాయని ధర్మాసనం ఘాటుగా విమర్శించింది.

**ఏమిటీ వివాదం?**

హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం తమ రాష్ట్ర రెరా కార్యాలయాన్ని సిమ్లా నుంచి ధర్మశాలకు తరలిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ నిర్ణయం వల్ల ఉద్యోగులకు, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంటూ హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ఆ నోటిఫికేషన్‌పై స్టే విధించింది. దీన్ని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయిమాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారించింది.

**ధర్మాసనం ప్రధాన వ్యాఖ్యలు**

విచారణ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ రెరా పనితీరును తప్పుబడుతూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. 'రెరాను ఏర్పాటు చేసిన అసలు ఉద్దేశాన్ని రాష్ట్రాలు విస్మరిస్తున్నాయి. డిఫాల్ట్ అయిన బిల్డర్లకు సహకరించడం తప్ప, ఈ సంస్థల వల్ల సామాన్యులకు ఒరిగేదేమీ లేదు. ఇలాంటి సంస్థలను కొనసాగించడం కంటే రద్దు చేయడమే మేలు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బిల్డర్ల పట్ల ఈ సంస్థలు చూపిస్తున్న సానుకూల ధోరణిపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల మార్పు అనేది పరిపాలనాపరమైన నిర్ణయమని పేర్కొంటూ హైకోర్టు విధించిన స్టేను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

**కోర్టు ఆదేశాలు**

రెరా కార్యాలయాన్ని, అప్పీలేట్ ట్రిబ్యునల్‌ను సిమ్లా నుంచి ధర్మశాలకు మార్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది. ప్రజలకు, బాధితులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రిన్సిపల్ అప్పీలేట్ బాడీని కూడా ధర్మశాలకే తరలించాలని సూచించింది. హిమాచల్ ప్రదేశ్ వెనుకబడిన తరగతుల కమిషన్ కార్యాలయం తరలింపుపై ఉన్న స్టేను కూడా కోర్టు తొలగించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపించారు. కాగా, గతేడాది జూన్ 13న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు పక్కన పెట్టడంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభించినట్లయింది. అయితే, దేశవ్యాప్తంగా ఉన్న రెరా సంస్థల పనితీరుపై సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగంలో చర్చనీయాంశంగా మారాయి.

# ఏడాదిలో 4000 కోట్ల స్పామ్ కాల్స్!

భారత్ డిజిటల్ విప్లవం దిశగా దూసుకుపోతున్న వేళ స్పామ్ కాల్స్, సైబర్ మోసాలు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయి. 2025 సంవత్సరంలో భారతీయులకు ఏకంగా 4,000 కోట్లకు పైగా స్పామ్ కాల్స్ వచ్చినట్లు 'ట్రూకాలర్ ఇండియా ఇన్‌సైట్స్ రిపోర్ట్ 2025' కొన్ని విషయాలను వెల్లడించింది. ఈ సందర్భంగా ట్రూకాలర్ సీఈఓ రిషిత్ ఝున్‌ఝున్‌వాలా మాట్లాడుతూ.. వికసిత్ భారత్ విజన్‌లో భాగంగా దేశం డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మారుతున్న తరుణంలో కమ్యూనికేషన్ వ్యవస్థపై నమ్మకం చాలా కీలకమన్నారు. 'ఈ రోజుల్లో మోసం అనేది కేవలం సాంకేతిక సమస్య కాదు, అది మానవ బలహీనతలతో ఆడుకునే ప్రక్రియ. భయం, అత్యవసరం, అనిశ్చితిని పెట్టుబడిగా చేసుకుని స్కామర్లు రెచ్చిపోతున్నారు. ప్రతి భారతీయుడికి డిజిటల్ భద్రత కల్పించాలన్నదే మా లక్ష్యం' అన్నారు.నివేదిక ప్రకారం, గడిచిన ఏడాదిలో నమోదైన స్పామ్ కాల్స్ వివరాలు ఇలా ఉన్నాయి:


మొత్తం స్పామ్ కాల్స్: 4,168 కోట్లు.

బ్లాక్ చేసిన కాల్స్: 1,189 కోట్లు (యూజర్లకు చేరక ముందే సాంకేతికతతో నిరోధించినవి).

మోసపూరిత కాల్స్: సుమారు 770 కోట్లు. ఇవి ప్రధానంగా బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, పేమెంట్ ప్లాట్‌ఫారమ్‌ల పేరుతో వచ్చాయి.

స్పామ్ ఎస్ఎంఎస్‌లు: ఏడాది పొడవునా 12,903 కోట్ల స్పామ్ సందేశాలు నమోదయ్యాయి. స్పామ్ కాల్స్ నిరోధించడం వల్ల కేవలం మోసాలు తగ్గడమే కాకుండా ప్రజల విలువైన సమయం కూడా ఆదా అవుతోంది. కమ్యూనిటీ రిపోర్టింగ్ ద్వారా భారతీయులకు రోజుకు సుమారు 21.7 లక్షల గంటల సమయం ఆదా అవుతోందని నివేదిక పేర్కొంది. దీని వల్ల అనవసరపు ఒత్తిడి తగ్గడమే కాకుండా హడావుడిలో తీసుకునే తప్పుడు నిర్ణయాల వల్ల కలిగే ఆర్థిక నష్టాలను నివారించవచ్చు.రాబోయే రోజుల్లో మోసగాళ్లు మరింత అధునాతన పద్ధతులను అవలంబిస్తారని నివేదిక హెచ్చరించింది. అందులో ఏఐ సృష్టించిన వాయిస్ స్కామ్స్, కాల్స్, మెసేజ్‌లతో చేసే మోసాలు ఉండనున్నాయి. ఇతరుల పేర్లతో డిజిటల్ ఐడెంటిటీని దొంగిలించడం వంటి మోసాలు ఎక్కువగా జరగవచ్చని అంచనా. అత్యవసరమని వచ్చే కాల్స్‌ను వెంటనే నమ్మకుండా ధ్రువీకరించుకోవాలి. వ్యక్తిగత వివరాలను, ఓటీపీలను ఎవరితోనూ పంచుకోకూడదు. నమ్మకమైన కాలర్ ఐడీ సాధనాలను ఉపయోగించాలి. డిజిటల్ సాధికారత సాధించే క్రమంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండటమే అసలైన రక్షణ అని గుర్తించాలి.

## భారీ నష్టాల్లో ముగిసిన
# స్టాక్ మార్కెట్లు



గురువారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 558.72 పాయింట్ల నష్టంతో.. 83,674.92 వద్ద, నిఫ్టీ 146.65 పాయింట్ల నష్టంతో 25,807.20 వద్ద నిలిచాయి. టాప్ గెయినర్స్ జాబితాలో జీఈ పవర్ ఇండియా లిమిటెడ్, క్రౌన్ లిఫ్టర్స్ లిమిటెడ్, రత్నమణి మెటల్స్ & ట్యూబ్స్ లిమిటెడ్, అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ లిమిటెడ్, అవంతి ఫీడ్స్ లిమిటెడ్ వంటి కంపెనీలు చేరాయి. ధ్రువ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్, నెట్‌వర్క్ పీపుల్ సర్వీసెస్ టెక్నాలజీస్ లిమిటెడ్, యూనిటెక్ లిమిటెడ్, కిలిచ్ డ్రగ్స్(ఐ) లిమిటెడ్, నోవా అగ్రిటెక్ లిమిటెడ్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.

# ఎంజీ మెజెస్టర్ వచ్చేసింది: రూ.41 వేలతో బుకింగ్!



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కొత్త ఎంజీ మెజెస్టర్ వచ్చేసింది. దేశీయ విఫణిలో లాంచ్ కానున్న ఈ ఎస్‌యూవీ.. జీప్ మెరిడియన్, స్కోడా కొడియాక్ వంటి వాటికి ప్రధాన ప్రత్యర్థిగా ఉంటుంది. కొత్త మెజెస్టర్ కోసం ఎంజీ మోటార్ బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించింది. దీనిని రూ.41 వేలు చెల్లించి బుక్ చేసుకోవచ్చు. 2026 మే నెలలో డెలివరీలు జరిగే అవకాశం ఉంది. అంతకంటే ముందు ఏప్రిల్‌లో టెస్ట్ డ్రైవ్‌లు మొదలవుతాయి. కాగా కంపెనీ త్వరలోనే ఈ కారు ధరలను వెల్లడించనుంది. ఎంజీ మోటార్.. తన కొత్త మెజెస్టర్ ఎస్‌యూవీని మూడు వేరియంట్లలో లాంచ్ చేయనుంది. అవి ఎంట్రీ లెవల్ షార్ప్ 4x2, మిడ్ స్పెక్ సావీ 4x2 & టాప్ స్పెక్ సావీ 4x4. ఇవి 6 సీటర్, 7 సీటర్ రూపంలో మార్కెట్లోకి అమ్మకానికి వస్తుంది. మెజెస్టర్‌ను ముందస్తుగా రిజర్వ్ చేసుకున్న మొదటి 3,000 మంది కస్టమర్లకు 5 సంవత్సరాల అపరిమిత కిలోమీటర్ల వారంటీ, 5 సంవత్సరాల రోడ్‌సైడ్ అసిస్ట్, 5 సంవత్సరాల లేబర్‌ఫ్రీ సర్వీస్ కాంట్రాక్ట్‌ను అందించనున్నట్లు సంస్థ వెల్లడించింది.ఎంజీ మెజెస్టర్ కేవలం 2.0 లీటర్ ట్విన్ టర్బోచార్జ్డ్ డీజిల్ ఇంజిన్ ఎంపికలో మాత్రమే లభిస్తుంది. ఇది 215 హార్స్ పవర్ & 478 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇందులో 8 స్పీడ్ టార్క్‌కన్వర్టర్ ఆటోమేటిక్ రెగ్యులర్ ట్రాన్స్‌మిషన్ ఉంటుంది. పనితీరు దాదాపు గ్లోస్టర్ మాదిరిగా ఉంటుందని సమాచారం. మంచి డిజైన్ కలిగిన మెజెస్టర్.. ట్విన్ పేన్ పనోరమిక్ సన్‌రూఫ్, ప్యాడిల్ షిఫ్టర్లు, వైర్‌లెస్ ఆపిల్ కార్‌ప్లే & ఆండ్రాయిడ్ ఆటో, 12 స్పీకర్ జేబీఎల్ ఆడియో సిస్టమ్ & 64 కలర్ యాంబియంట్ లైట్స్ వంటి వాటితో పాటు.. లెవల్ 2 అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్ట్ సిస్టమ్స్ కూడా పొందుతుంది. ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ హోల్డ్ అసిస్ట్ & హిల్‌డిసెంట్ కంట్రోల్, ఐసోఫిక్స్ యాంకరేజ్‌లు, సరౌండ్ వ్యూ కెమెరాలు & ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు కూడా ఉన్నాయి.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# భారత్‌తో ఒప్పందం చరిత్రాత్మకం: ట్రంప్



**వాషింగ్టన్:** తాము భారతదేశంతో కుదుర్చుకున్న నూతన వాణిజ్య ఒప్పందం చరిత్రాత్మకమైనదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభివర్ణించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఒప్పందం కారణంగా అమెరికా నుంచి బొగ్గు ఎగుమతులు భారీగా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా ప్రస్తుతం ప్రపంచంలోనే నంబర్ వన్ ఇంధన ఉత్పత్తిదారుగా ఎదిగిందన్నారు. జపాన్, కొరియా తదితర దేశాలతో పాటు భారత్‌తో కుదిరిన ఈ తాజా ఒప్పందాలు అమెరికా ఇంధన ఎగుమతులను మరింత విస్తృతం చేస్తాయని ట్రంప్ అన్నారు. తమ దేశ బొగ్గు ప్రపంచంలోనే అత్యుత్తమ నాణ్యత కలిగినదని ట్రంప్ పేర్కొన్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమైన భారత్‌అమెరికా వాణిజ్య చర్చలు దాదాపు ఏడాది కాలం పాటు సాగి, చివరకు ఒక కొలిక్కి వచ్చాయి. గత వారంలో ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణలో ఈ తాత్కాలిక ఒప్పందానికి సంబంధించిన విధివిధానాలు ఖరారయ్యాయి. 2025 ఆగస్టులో రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లు చేస్తున్నారనే నెపంతో అమెరికా.. భారత్‌పై 50 శాతం సుంకాలను విధించడంతో చర్చలు స్తంభించాయి. అయితే, తాజా దౌత్యపరమైన ముందడుగుతో ఇరు దేశాల మధ్య సత్సంబంధాలను చక్కదిద్దింది. ఈ నూతన ఒప్పందం ప్రకారం భారతీయ ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న దిగుమతి సుంకాలు భారీగా తగ్గనున్నాయి. గతంలో 50 శాతంగా ఉన్న సుంకాన్ని ఇప్పుడు 18 శాతానికి తగ్గించారు. దీనివల్ల అమెరికా మార్కెట్లో భారతీయ వస్తువుల ధరలు తగ్గి, పోటీ మరింతగా పెరగనుంది. వాషింగ్టన్ విడుదల చేసిన 'ఫ్యాక్ట్ షీట్' ప్రకారం ఈ ఒప్పందం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు పరస్పర ప్రయోజనం చేకూర్చే విధంగా రూపొందాయి. ఇది భారత్ నుంచి అమెరికాకు జరిగే వాణిజ్యాన్ని కొత్త పుంతలు తొక్కించనుంది. ఈ సుంకాల తగ్గింపు నిర్ణయంతో భారతదేశంలోని కీలక రంగాలకు భారీ లబ్ధి చేకూరనుంది. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, వస్త్రాలు, తోలు, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బరు ఉత్పత్తులు, ఆర్గానిక్ కెమికల్స్ ఎగుమతులు పెరగనున్నాయి. వీటితో పాటు గృహాలంకరణ వస్తువులు, హస్తకళాకృతులు, ఎంపిక చేసిన యంత్ర పరికరాల విభాగాల్లో భారతీయ ఎగుమతిదారులు అమెరికా మార్కెట్లో తమ పట్టును సాధించే అవకాశం ఉంది. ఈ ఒప్పందం భారతీయ పారిశ్రామిక రంగానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.



## పార్లమెంటులో
# ఎంపీల రణరంగం

**అంకారా:** టర్కీ పార్లమెంటు బుధవారం యుద్ధభూమిని తలపించింది. అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ సమక్షంలో మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుండగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అది చివరకు పరస్పర దాడులకు దారితీసింది. నూతన న్యాయశాఖ మంత్రి అకిన్ గుర్లెక్ ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకునేందుకు ప్రతిపక్ష సభ్యులు ప్రయత్నించడంతో సభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. ఎంపీలు ఒకరినొకరు నెట్టుకుంటూ, పిడిగుద్దులు కురిపించుకోవడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ ఘర్షణల నేపథ్యంలో స్పీకర్ సభను 15 నిమిషాల పాటు తాత్కాలికంగా వాయిదా వేయాల్సి వచ్చింది. క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా న్యాయశాఖ మంత్రిగా నియమితులైన అకిన్ గుర్లెక్‌ను పోడియం వద్దకు రాకుండా ప్రతిపక్ష సభ్యులు అడ్డుకోవడంతో వివాదం మొదలైంది. అధికార ఏకే పార్టీ సభ్యులంతా గుర్లెక్‌కు రక్షణగా నిలవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. సభా విరామం అనంతరం భారీ భద్రత మధ్య గుర్లెక్ ప్రమాణ స్వీకారాన్ని పూర్తి చేశారు. గుర్లెక్ గతంలో ఇస్తాంబుల్ చీఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసిన సమయంలో ప్రధాన ప్రతిపక్షమైన రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ నేతలపై రాజకీయ ప్రేరేపిత కేసులు పెట్టారని ప్రతిపక్షం ఆరోపిస్తోంది. గుర్లెక్ నియామకం దేశంలో న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీస్తుందని ప్రతిపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎర్డోగాన్ రాజకీయ ప్రత్యర్థిగా భావించే ఇస్తాంబుల్ మేయర్ ఎక్రెమ్ ఇమామోగ్లుపై గుర్లెక్ కఠినమైన చర్యలు తీసుకోవడాన్ని వారు ప్రస్తావిస్తున్నారు. గత ఏడాది అవినీతి ఆరోపణలపై ఇమామోగ్లును అరెస్ట్ చేయగా, గుర్లెక్ ఆయనపై ఏకంగా 142 నేరాలకు సంబంధించి అభియోగపత్రం దాఖలు చేశారు. ఇందులో గరిష్ఠంగా 2,000 సంవత్సరాల జైలు శిక్ష విధించాలని ప్రాసిక్యూటర్లు కోరడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.అధ్యక్షుడు ఎర్డోగాన్ చేపట్టిన క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణలో న్యాయశాఖతో పాటు అంతర్గత వ్యవహారాల శాఖలోనూ మార్పులు జరిగాయి. ఎర్జురం ప్రావిన్స్ గవర్నర్ ముస్తాఫా చిఫ్చిని కొత్త అంతర్గత వ్యవహారాల మంత్రిగా నియమితులయ్యారు. ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న మున్సిపాలిటీలపై ప్రభుత్వం అవినీతి నిరోధక దాడులను ఉధృతం చేసిన తరుణంలో ఈ మార్పులు చోటుచేసుకోవడం గమనార్హం. ఇప్పటికే వందలాది మంది ప్రతిపక్ష మున్సిపల్ అధికారులను అరెస్ట్ చేశారు. ఈ తాజా నియామకాలు టర్కీ రాజకీయాల్లో మరిన్ని ప్రకంపనలు సృష్టించేలా ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు.

# కెనడా కాల్పుల ఘటన...
## నిందితుని ఉన్మాదం వెనుక..



**వాంకోవర్:** కెనడాలో బుధవారం జరిగిన కాల్పుల ఘటనలో నిందితునికి సంబంధించిన విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఘటనలో 'జెస్సీ' అనే యువకుడు సృష్టించిన బీభత్సానికి పదిమంది మృతి చెందగా, 27 మంది గాయపడ్డారు. మృతుల్లో జెస్సీ కన్నతల్లి, సోదరితో పాటు ఒక ఉపాధ్యాయురాలు, అభం శుభం తెలియని పసిపిల్లలు ఉండటం అందరినీ కలిచివేస్తోంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన పలువురు ఆస్పత్రులలో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఉన్మాదానికి వెనుక ఉన్న కారణాలు ఇప్పుడు వార్తల్లో నిలిచాయి. జెస్సీ గత కొంతకాలంగా తీవ్రమైన మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని, అతను ఎప్పుడైనా ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ప్రభుత్వానికి, సంబంధిత ఏజెన్సీలకు ముందే తెలుసని సమాచారం. అయినప్పటికీ అతడిని ఒక రోగిగా గుర్తించి, సరైన మానసిక చికిత్స అందించడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వం జెస్సీ మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సింది పోయి, అతడిని ఒక అమ్మాయిగా పరిగణించి కృత్రిమమైన పద్ధతులను ప్రోత్సహించిందనే మాట వినిపిస్తోంది. అతనికి 'క్రాస్ సెక్స్ హార్మోన్లు', ఇతర మందులను ఇవ్వడం ద్వారా అతని శరీరాన్ని, ఆలోచనా తీరును విషపూరితం చేశారని తెలుస్తోంది. ఒక మానసిక రోగి భ్రమలను సరిదిద్దకుండా, వాటిని మరింతగా ప్రేరేపించిన కారణంగానే అతను తనపై తాను నియంత్రణ కోల్పోయి ఇంతటి ఘాతుకానికి పాల్పడ్డాడని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

# మరో హిందూ యువకుని దారుణ హత్య




**ఢాకా:** బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ వేళ మౌల్వీబజార్ జిల్లాలో ఒక హిందూ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. చంపారా టీ గార్డెన్ కార్మికుడైన 28 ఏళ్ల రతన్ శుభోకర్ పోలీసులకు విగతజీవిగా కనిపించాడు. అతని కాళ్లు, చేతులు కట్టేసి ఉండటంతో పాటు శరీరంపై తీవ్ర గాయాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. గురువారం ఓటింగ్ జరగడానికి కొద్దిసేపటి ముందే ఈ దారుణం చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక పత్రిక 'డైలీ స్టార్' నివేదిక ప్రకారం రతన్ శుభోకర్ మృతదేహం రక్తంతో తడిసి ఉండటాన్ని గమనించిన కార్మికులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు లక్ష్మణ్ కర్ మాట్లాడుతూ, మంగళవారం రాత్రి నుండి రతన్ కనిపించకుండా పోయాడని, తరువాత తోటలో శవమై కనిపించాడని తెలిపారు. ఈ హత్యకు గల కారణాలు తమకు తెలియవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామని, నిందితులను గుర్తించేందుకు విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో ఎన్నికల వేళ మైనారిటీల భద్రత ప్రశ్నార్థకంగా మారుతున్నది. గత జనవరి నెలలోనే జైలు కస్టడీలో దాదాపు 15 మంది మరణించారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదించింది. మరణించిన వారిలో అవామీ లీగ్ సీనేయర్ నేత రమేష్ చంద్ర సేన్, ప్రముఖ సంగీత విద్వాంసుడు ప్రళయ్ చకి తదితరులు ఉన్నారు. డిసెంబర్ 2024లో విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హదీ హత్య తర్వాత దేశవ్యాప్తంగా చెలరేగిన అశాంతిలో పలువురు హిందూ యువకులు ప్రాణాలు కోల్పోయారు. తాత్కాలిక ప్రభుత్వం శాంతిభద్రతల గురించి హామీలు ఇస్తున్నప్పటికీ, మతోన్మాద శక్తుల ప్రాబల్యం పెరుగుతుండటంపై మైనారిటీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

# ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ సౌత్ నామినేషన్లు

2024లో విడుదలైన తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ చిత్రాలకు గాను 70వ ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డ్స్ నామినేషన్లను గురువారం (ఫిబ్రవరి 12) ప్రకటించారు. ఫిబ్రవరి 21న కేరళ వేదికగా ఈ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. అల్లు అర్జున్ 'పుష్ప 2', శివకార్తికేయన్ 'అమరన్', ఫహద్ ఫాసిల్ 'ఆవేశం' వంటి సినిమాలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. పూర్తి నామినేషన్ల జాబితా ఇక్కడ చూడండి.

**పూర్తి నామినేషన్ల జాబితా...**

**తెలుగు:**

బెస్ట్ మూవీ
35 చిన్న కథ కాదు
కమిటీ కుర్రోళ్ళు
హనుమాన్
కల్కి 2898 AD
లక్కీ భాస్కర్
పుష్ప 2: ది రూల్

బెస్ట్ డైరెక్టర్
నాగ్ అశ్విన్ (కల్కి 2898 AD)
నంద కిషోర్ ఈమని (35 చిన్న కథ కాదు)
ప్రశాంత్ వర్మ (హనుమాన్)
సుకుమార్ (పుష్ప 2: ది రూల్)
వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
యదు వంశీ (కమిటీ కుర్రోళ్ళు)

బెస్ట్ యాక్టర్ (మేల్)
అల్లు అర్జున్ (పుష్ప 2: ది రూల్)
దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్)
జూనియర్ ఎన్టీఆర్ (దేవర: పార్ట్ 1)
నాని (సరిపోదా శనివారం)
సిద్దు జొన్నలగడ్డ (టిల్లు స్క్వేర్)
తేజ సజ్జా (హనుమాన్)

బెస్ట్ యాక్టర్ (ఫిమేల్)
అనుపమ పరమేశ్వరన్ (టిల్లు స్క్వేర్)
ఆషికా రంగనాథ్ (నా సామిరంగ)
మీనాక్షి చౌదరి (లక్కీ భాస్కర్)
నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)
ప్రియాంక మోహన్ (సరిపోదా శనివారం)
రష్మిక మందన్న (పుష్ప 2: ది రూల్)

ఉత్తమ సహాయ నటుడు (మేల్)
అమితాబ్ బచ్చన్ (కల్కి 2898 AD)
ధనంజయ (జీబ్రా)
ఫహద్ ఫాసిల్ (పుష్ప 2: ది రూల్)
సత్య (మత్తు వదలరా 2)
ఎస్.జె. సూర్య (సరిపోదా శనివారం)
వినయ్ రాయ్ (హనుమాన్)

ఉత్తమ సహాయ నటి (Female)
అంజలి (గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి)
ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా 2)
రాశి సింగ్ (ప్రసన్న వదనం)
శరణ్య ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజి బ్యాండు)
శ్రద్ధా శ్రీనాథ్ (మెకానిక్ రాకీ)
వరలక్ష్మి శరత్‌కుమార్ (హనుమాన్)

ఉత్తమ మ్యూజిక్ ఆల్బమ్
అనిరుధ్ రవిచందర్ (దేవర: పార్ట్ 1)
చైతన్ భరద్వాజ్ (హరోం హర)
దేవి శ్రీ ప్రసాద్ (పుష్ప 2: ది రూల్)
జి.వి. ప్రకాష్‌కుమార్ (లక్కీ భాస్కర్)
గౌర హరి, అనుదీప్ దేవ్, కృష్ణ సౌరభ్ (హనుమాన్)
జేక్స్ బిజోయ్ (సరిపోదా శనివారం)
తమన్ ఎస్ (గుంటూరు కారం)

**తమిళం**

ఉత్తమ చిత్రం: అమరన్, కొట్టుక్కాలి, లబ్బర్ పందు, మహారాజా, మెయ్యళగన్, వాళై

ఉత్తమ దర్శకుడు: సి. ప్రేమ్ కుమార్ (మెయ్యళగన్), మారి సెల్వరాజ్ (వాళై), నితిలన్ స్వామినాథన్ (మహారాజా), పా. రంజిత్ (తంగలాన్), పి.ఎస్. వినోద్‌రాజ్ (కొట్టుక్కాలి), రాజ్‌కుమార్ పెరియసామి (అమరన్)

ఉత్తమ నటుడు: అరవింద్ స్వామి (మెయ్యళగన్), అట్టకత్తి దినేశ్ (లబ్బర్ పంతు), విక్రమ్ (తంగలాన్), ధనుష్ (కెప్టెన్ మిల్లర్), శివకార్తికేయన్ (అమరన్), సూరి (గరుడన్), విజయ్ సేతుపతి (మహారాజా)

ఉత్తమ నటి: అన్న బెన్ (కొట్టుక్కాలి), కీర్తి సురేష్ (రఘు తాత), సాయి పల్లవి (అమరన్), సిమ్రాన్ (అంధగన్), శ్రీ గౌరీ ప్రియ (లవర్), ఊర్వశి (జే బేబీ)

**మలయాళం**

ఉత్తమ చిత్రం: ఆడుజీవితం, ఆట్టం, ఆవేశం, భ్రమయుగం, కిష్కింధ కాండం, మంజుమ్మెల్ బాయ్స్, ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్, ప్రేమలు, ఉల్లోళుక్కు



ఉత్తమ దర్శకుడు: బ్లెస్సీ (ఆడుజీవితం), చిదంబరం (మంజుమ్మెల్ బాయ్స్), జిత్రు మాధవన్ (ఆవేశం), రాహుల్ సదాశివన్ (భ్రమయుగం) తదితరులు.

ఉత్తమ నటుడు: ఆసిఫ్ అలీ (కిష్కింధ కాండం), బేసిల్ జోసెఫ్ (సూక్ష్మదర్శిని), ఫహద్ ఫాసిల్ (ఆవేశం), మమ్ముట్టి (భ్రమయుగం), పృథ్వీరాజ్ సుకుమారన్ (ఆడుజీవితం), టొవినో థామస్ (ARM)

ఉత్తమ నటి: మమితా బైజు (ప్రేమలు), నజ్రియా (సూక్ష్మదర్శిని), పార్వతి తిరువోతు (ఉల్లోళుక్కు), ఊర్వశి (ఉల్లోళుక్కు) తదితరులు.

**కన్నడ (Kannada)**

ఉత్తమ చిత్రం: బఘీర, భీమ, బ్లింక్, హదినెలెంటు, కృష్ణం ప్రణయ సఖి, శాఖాహారి

ఉత్తమ నటుడు: దునియా విజయ్ (భీమ), గణేష్ (కృష్ణం ప్రణయ సఖి), శివరాజ్‌కుమార్ (భైరతి రణగల్), శ్రీమురళి (బఘీర), సుదీప్ (మ్యాక్స్)

ఉత్తమ నటి: రుక్మిణి వసంత్ (బఘీర), చైత్ర ఆచార్ (బ్లింక్) తదితరులు.



## నేను హీరో అవ్వడానికి ట్రై చేయడమేంటి మేడమ్?

టాలీవుడ్ హీరో శ్రీ విష్ణు నటిస్తోన్న క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ మృత్యుంజయ్. ఈ సినిమాకు హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహిస్తున్నారు. సామజవరగమన చిత్రం తర్వాత శ్రీ విష్ణు, రెబా మోనికా జాన్ జంటగా నటిస్తోన్న మూవీ కావడంతో అంచనాలు పెరిగాయి. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. టాలీవుడ్ దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి చేతుల మీదుగా విడుదల చేశారు. టీజర్ చూస్తుంటే క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఓ మర్డర్ కేసు ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారని టీజర్‌లో అర్థమవుతోంది. కాగా.. ఈ మూవీని లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైన్ మెంట్‌పై సందీప్ గున్నం, వినయ్ చిలకపాటి నిర్మించారు. ఈ చిత్రంలో సుదర్శన్, రచ్చ రవి, అయ్యప్ప, సిజ్జు, ఐశ్వర్య, బాలాదిత్య, కృష్ణ కౌశిక్, నంద గోపాల్, మృంచి మాధవి కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి కాల భైరవ సంగీతమందిస్తున్నారు.

## వివాదంలో యశ్ టాక్సిక్..
### క్షమాపణలు చెప్పాలని డిమాండ్..!



కేజీఎఫ్ హీరో నటించిన ఫుల్ యాక్షన్ మూవీ టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్. ఈ సినిమా రిలీజ్‌కు ముందే వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. టీజర్ రిలీజ్ తర్వాత బోల్డ్ సీన్‌పై పెద్ద ఎత్తున విమర్శలొచ్చాయి. ఆ సీన్ విషయంలో కొందపు ఏకంగా డైరెక్టర్ గీతూ మోహన్ దాస్‌పై మహిళా కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశారు. తాజాగా ఈ సినిమా థియేటర్లలో రిలీజ్‌కు ముందే మరో కొత్త వివాదానికి దారి తీసింది. ఈ సినిమాలో మతపరమైన విశ్వాసాలను కించపరిచేలా చిత్రీకరించారని ఓ సంస్థ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ సినిమాలోని కొన్ని దృశ్యాలు తమ మత విశ్వాసాలను అగౌరవపరిచేలా ఉన్నాయంటూ నేషనల్ క్రిస్టియన్ ఫెడరేషన్ సంబంధిత అధికారులకు లేఖ రాసింది. తమ మతంలో ప్రధాన దేవదూత అయిన సెయింట్ మైఖేల్ చిత్రీకరణపై ఈ బృందం ప్రత్యేకంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. సెయింట్‌ను అభ్యంతరకరమైన రీతిలో చిత్రీకరించారని.. ఇది తమ మనోభావాలను దెబ్బతీసిందని నేషనల్ క్రిస్టియన్ ఫెడరేషన్ ఆరోపిస్తోంది. అభ్యంతరకర సన్నివేశాలను తొలగించాడని ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ అధికారులను కోరారు. వివాదాస్పద దృశ్యాలను, ఆన్‌లైన్ వీడియోలను కూడా తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా అదనంగా చిత్రనిర్మాతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై మూవీ మేకర్స్ స్పందించాల్సి ఉంది. దీనిపై ఇప్పటి వరకు చిత్రనిర్మాతలు ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. కాగా.. ఈ సినిమా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ మూవీ ధురంధర 2తో పోటీ పడనుంది.

## రాజ్‌కుమార్ హిరాణి హిట్ సినిమా సీక్వెల్ రెడీ




బాలీవుడ్ స్టార్ దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణి 3 ఇడియట్స్' మూవీ సీక్వెల్ ప్రకటించాడు. ఇప్పటికే అందుకు సంబంధించిన పనులు కూడా ప్రారంభం అయ్యాయి అని తెలిపాడు. విధు వినోద్ చోప్రా నిర్మించిన ఈ చిత్రం 2009లో విడుదలై, బ్లాక్ బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఇందులో ఆమిర్‌ఖాన్ హీరోగా, ఆర్. మాధవన్ , శర్మన్ జోషి, కరీనా కపూర్, బొమన్ ఇరానీ ప్రధానపాత్రల్లో నటించారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో 3 ఇడియట్స్ సీక్వెల్ గురించి రాజ్‌కుమార్ హిరాణి ఇలా అన్నారు. 3 ఇడియట్స్ సీక్వెల్ కథ కోసం పనులు ప్రారంభించామన్నారు. స్టోరీ విషయంలో సరికొత్త ఆలోచన వచ్చిందని క్లారిటీ ఇచ్చారు. అయితే, ప్రేక్షకులు ఎలా రిసీవ్‌చేసుకుంటారో అనే ఆలోచన కూడా ఉంది. ఇప్పటికీ పూర్తి స్థాయిలో స్క్రిప్ట్ పనులు మొదలుపెట్టలేదంటూనే దాదాపు అంతా సిద్ధమైందన్నారు. ప్రధానపాత్రధారులు 15 సంవత్సరాల తర్వాత కలుసుకుంటే ఏం జరుగుతుంది? అనే కోణంలో '3 ఇడియట్స్' సీక్వెల్‌కథనం సాగుతుందని బాలీవుడ్ భోగట్టా. మరోవైపు మున్నాభాయ్ సీక్వెల్ కూడా కథ పూర్తి అయినట్లు ఆయన పేర్కొన్నారు.



## ఇప్పటికీ నెరవేరని కోరిక ఒకటే ఉంది: శ్రియ

సినిమాను ప్రేమిస్తే అది కచ్చితంగా ఉన్నత స్థాయిలో కుర్చోపెడుతుంది. ఇందుకు పలువురు ఉదాహరణ. ప్రతిభ, అంతకు మించిన ప్రేమ ఉంటే సినిమా ఎవరినైనా ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని చాలా మంది నిరూపించారు. అలాంటి వారిలో నటి శ్రియ ఒకరు అని చెప్పవచ్చు. ఉత్తరప్రదేశ్‌లోని హరిద్వార్‌లో పుట్టి, పెరిగిన ఈ బ్యూటీ 2001లో ఇష్టం అనే తెలుగు చిత్రం ద్వారా కథానాయికగా పరిచయం అయ్యారు. ఆ తరువాత హిందీ, తమిళం , కన్నడం తదితర భాషల్లో నటిస్తూ అగ్ర కథానాయికగా ఎదిగారు. తమిళంలో విజయ్, రజనీకాంత్, ధనుష్ వంటి స్టార్ హీరోలతో , తెలుగులో చిరంజీవి, నాగార్జున వెంకటేష్‌వంటి టాప్ స్టార్స్ తో జతకట్టి క్రేజీ హీరోయిన్‌గా ఎదిగారు. ఎక్కువగా గ్లామరస్ పాత్రల్లోనే ఈమె నటించారన్నది గమనార్హం. ఏదేమైనా గత 25 ఏళ్లుగా నాట్ అవుట్‌గా కొనసాగుతున్న శ్రియ కొంత కాలం క్రితం పెళ్లి చేసుకున్నారు. అయినప్పటికీ నటనకు దూరం కాలేదు. ప్రస్తుతం కథానాయకి పాత్రలు కాకపోయినా నటనకు అవకాశం ఉన్న అక్క,అమ్మ వంటి పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం హిందీలో దశ్యం 3 చిత్రంలో నటిస్తున్నారు. కాగా నటి శ్రియ మంచి నృత్య కళాకారిణి అన్నది గమనార్హం. ఇటీవల ఈ భామ ఓ భేటీలో పేర్కొంటూ చాలా భాషల్లో చాలా చిత్రాల్లో నటించానని, అయితే తాను మొదట ప్రేమించేది నాట్యాన్ని అని చెప్పారు. ఇంత వరకు నటించని, నటించాలని ఆశపడే పాత్ర ఏదైనా ఉందా? అన్న ప్రశ్నకు కచ్చితంగా ఉందన్నారు. తనకు నాట్య కళాకారిణి పాత్రలో నటించాలనే కోరిక చాలా ఏళ్లుగా ఉండిపోయిందన్నారు. ఒక నాట్యకళాకారిణిగా జీవిత పయనాన్ని పూర్తి స్థాయిలో ఆవిష్కరించే కథా చిత్రంలో నటించాలని కోరుకుంటున్నట్లు శ్రియ పేర్కొన్నారు. తన కెరీర్ మొత్తంలో ఎవరూ కూడా అలాంటి పాత్ర తమ సినిమాలో ఉందని తనను కలవలేదని చెప్పారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఈ భామ కోరిక నెరవేరే అవకాశం ఏ మేరకు ఉంటుందో చూడాలి.



## రష్మిక-విజయ్ పెళ్లి వేడుక.. కోట్ల రూపాయల డీల్‌కు నో..!

టాలీవుడ్‌లో గత కొంత కాలంగా వీరి పెళ్లి చుట్టే చర్చ నడుస్తోంది. ఎంగేజ్‌మెంట్ వార్తల తర్వాత ఆ ఇద్దరు స్టార్స్ పెళ్లి వేడుక కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ జంట మరెవరో కాదు.. టాలీవుడ్‌లో మోస్ట్ వైరల్ ప్రేమజంట రష్మిక విజయ్ దేవరకొండ. వీరిద్దరి పెళ్లి ఫిబ్రవరిలోనే జరనుందని వచ్చినా డేట్ విషయంలో క్లారిటీ లేదు. మొదట ఫిబ్రవరి 2న జరగనుందని వార్తలొచ్చనా అలా జరగలేదు. తాజాగా ఈనెల 26న ఈ గ్రాండ్ వెడ్డింగ్ జరగనుందని టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో విజయ్ రష్మిక పెళ్లికి సంబంధించిన మరో న్యూస్ తెగ వైరలవుతోంది. వీరి పెళ్లి వీడియోను ఏ ఓటీటీకి ఇచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ వెడ్డింగ్ కార్యక్రమాన్ని స్ట్రీమింగ్ చేసేందుకు ప్రముఖ ఓటీటీ సంస్థ భారీ ఆఫర్‌తో ముందుకొచ్చనట్లు సమాచారం. అయితే తమ వ్యక్తిగత జీవితంలో బిజినెస్ చేసే ఉద్దేశం లేదని ఓటీటీ విజ్ఞప్తిని తిరస్కరించనట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. గతంలో లేడీ సూపర్ స్టార్ నయనతార వెడ్డింగ్ వీడియో విషయంలో ఎదురైన న్యాయపరమైన చిక్కులు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే విజయ్ రష్మిక జాగ్రత్త పడుతున్నట్లు టాక్. ముఖ్యంగా వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వేడుకతో వ్యాపారం చేయడం విజయ్‌కి అస్సలు ఇష్టం లేదని సమాచారం. అందుకే కోట్ల రూపాయలు ఆఫర్ చేసినా ఓటీటీ డీల్‌ను వీరు సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. తమ పెళ్లిని కేవలం కుటుంబ సభ్యుల మధ్య ప్రైవేట్‌గా ఉంచుకోవాలనే ఆలోచనలో ఉన్నారట. ఏదేమైనా వీరిద్దరి పెళ్లి కోసం టాలీవుడ్ అభిమానులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com